# అథ: పాతాళానికి నిర్మాణరంగం



- భారీగా పడిపోతున్న క్రయవిక్రయాలు
- గణనీయంగా తగ్గిన గృహ నిర్మాణ అనుమతులు
- ఏడాది కాలంగా ఇంకా కోలుకోలేని రియాల్టీ
- కోర్ సిటీతోపాటు, శివారుల్లోనూ తగ్గిన అనుమతులు

..మిగతా 3 లో


# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ 16.02.2025 | 24 క్యారెట్లు 87,678.00 | కిలో వెండి 1,07,78700 | 34 °C | సంపుటి:3 సంచిక:117

www.vishalabharati.com


# పార్లమెంట్ ఆమోదం పొందాకే బీసీలకు 42% రిజర్వేషన్లు





- ఇప్పటికిప్పుడు బీసీ కోటా సాధ్యం కాదు
- బీసీ రిజర్వేషన్లపై బీజేపీ వైఖరి ఏంటి..?
- మార్చిలో రిజర్వేషన్లపై తీర్మానం చేసి కేంద్రానికి పంపుతాం
- దమ్ముంటే ప్రత్యేక సెషన్ పెట్టి ఆమోదించాలి
- రాహుల్ గాంధీయే నా బాస్
- ఆయనతో ఎలాంటి దూరం లేదు
- ఆయన మాట తప్ప ఎవరినీ లెక్క చేయను
- ప్రధాని కులంపై తప్పుడు వ్యాఖ్యలు చేయలేదు
- ఫిరాయింపులపై సుప్రీంకోర్టు నిర్ణయమే ఫైనల్
- కోర్టు తీర్పు రాకుండానే కేటీఆర్ ఏదేదో చెబుతున్నాడు
- కొందరికి నేను నచ్చడం లేదనుకుంటా..
- అందుకే తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

*రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో ఇప్పటికిప్పుడు బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు పార్లమెంట్ ఆమోదం తప్పనిసరని, వచ్చే నెల తొలివారంలో అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ వైఖరి ఏంటని సీఎం రేవంత్ ప్రశ్నించారు. దమ్ముంటే పార్లమెంట్‌ప్రత్యేక సెషన్ పెట్టి బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలన్నారు. పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే బాధ్యతను రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బాధ్యత తీసుకోవాలని సవాల్ చేశారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో సమగ్రంగా కులగణన చేపట్టామని, అది దేశానికే ఒక రోడ్ మ్యాప్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. కులగణనలో సేకరించిన వివరాల ఆధారంగానే కమిషన్ లేదా అధికారులతో కమిటీ వేసి భవిష్యత్తులో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. ''మేం చేపట్టిన కులగణనలో బీసీలు ఆరు శాతం పెరిగారు. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వేలో 4 కేటగిరీలు మాత్రమే చూపారు. అందులో బీసీలు 51 శాతం, ఎస్సీలు 18 శాతం, ఎస్టీలు 10 శాతంకాగా.. మిగతా వాళ్లను ఓసీలుగా చూపారు. మేం చేసిన సర్వేలో మొత్తం ఐదు కేటగిరీలుగా విభజించాం. మా సర్వే ప్రకారం హిందూ, ముస్లిం బీసీలంతా కలిసి 56 శాతం ఉన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం తీసుకొచ్చి, పార్లమెంట్ ఆమోదానికి పంపిస్తాం. కేసీఆర్ సర్వేలో ఎస్సీల్లో 82 కులాలున్నాయని చెప్పారు. కానీ ఉన్నవి 59 కులాలే. స్పెల్లింగ్ తప్పుగా ఎంట్రీ అయినా దాన్ని మరో కులంగా చూపారు. లేని కులాలను ఇప్పుడు చూపెట్టాలంటే నేను ఎక్కడి నుంచి తేవాలి? ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు చేసిన నేను పట్టించుకోనని సీఎం రేవంత్ తెలిపారు.

..మిగతా 2 లో



## బీసీల్లో ముస్లింలను కలిపితే ఒప్పుకోం

- రాష్ట్ర తీర్మానాన్ని కేంద్రం ఆమోదించదు
- కులగణన తప్పుల తడక
- రాహుల్‌గాంధీ కులమేంది..?
- ప్రధానిపై అవాకులు, చవాకులు సరికాదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం

4 లో

## రూ.50 వేలకు మించి నగదు తీసుకుళితే సీజ్..

- 7 ఉమ్మడి జిల్లాల్లో ఎన్నికల కోడ్
- ఆధారాలు చూపకుంటే నగదు సీజ్
- అప్రమత్తం చేసిన అధికారులు

2 లో



## మరోసారి సమగ్ర కులగణన

- నేటి నుంచి వివరాల నమోదు
- టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే అధికారులే వస్తారని వెల్లడి

2 లో

# ఎన్నికల కోడ్‌లేని జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్లకు గ్రీన్ సిగ్నల్

- పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో నిర్మాణాలు ప్రారంభించాలి
- అవుటర్, ఆర్ఆర్ఆర్ మధ్య శాటిలైట్ టౌన్‌షిప్‌లు
- ఎంఐజీ, హెచ్ఐజీ, ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణాలు
- అనువైన ప్రాంతాన్ని గుర్తించి భూసేకరణ చేయాలి
- ప్రభుత్వ భూముల సంరక్షణకు పటిష్ఠ చర్యలు
- మూడు శాఖలపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. రెవెన్యూ, హౌజింగ్, ఐ అండ్ పీఆర్ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆర్థిక శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షించారు. మొదటి దశలో కేటాయించిన 70వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. అవుటర్ రింగురోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య పేద, మధ్య తరగతి ప్రజల కోసం శాటిలైట్ టౌన్‌షిప్‌లు నిర్మాణంపై గృహ నిర్మాణ శాఖ

..మిగతా 2 లో



## ప్రైవేటు స్కూళ్ల నిలువు దోపిడీ

- విద్యా సంవత్సరానికి ముందే భారీగా ఫీజుల పెంపు
- కొత్త చట్టం వస్తుందేమోనని కార్పొరేట్ స్కూళ్ల నిర్వాకం
- 15 నుంచి 40 శాతం పెంచుతున్నట్లు ప్రకటనలు
- ఆందోళనకు దిగుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నాయి. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణపై ఇటీవల కమిటీ అధ్యయనం చేసిన సంగతి తెలిసిందే. ఫీజులు తగ్గించాలని ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఇందుకోసం త్వరలో కొత్త చట్టం తీసుకురానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో కొత్త చట్టం వస్తుందేమోనన్న భయంతో కార్పొరేట్ స్కూళ్లు ఇప్పటి నుంచే వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజులు భారీగా పెంచేశాయి. ఒక్కో పాఠశాలలో 10 నుంచి 40 శాతం వరకు ఫీజులు పెంచినట్లు తెలుస్తోంది. దీనికి తోడు విద్యాసంవత్సరానికి ముందే సగం ఫీజు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో విద్యార్థుల

..మిగతా 2 లో



# ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట 15 మంది దుర్మరణం

- మహాకుంభ్‌మేళా భక్తులతో కిక్కిరిసిన రైల్వే స్టేషన్
- ఊహించని రీతిలో చేరుకున్న భక్తులు
- పరిస్థితిని అదుపులోకి తెచ్చిన ఢిల్లీ పోలీస్, సీఆర్‌పీఎఫ్ బలగాలు

..మిగతా 2 లో



## కేసీఆర్‌ను కట్టడి చేయాలని చూస్తున్నారు..

- ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదే లేదు
- 14 నెలల్లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు
- బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ కుట్రలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

2 లో

## మరో 119 మంది వెనక్కు

- అమృత్‌సర్‌కు చేరుకున్న వలసదారులు
- అమెరికా నుంచి భారత్‌కు వచ్చిన రెండో విమానం

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
16.02.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



# ఏడీఈ అక్రమాస్తులు రూ.100 కోట్లు పైనే

తవ్విన కొద్దీ బయటపడుతున్న వివరాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ నగరంలో మరో భారీ అవినీతి తిమింగలం ఏసీబీకి చిక్కింది. గచ్చిబౌలిలో విద్యుత్ శాఖ ఏడీఈ సతీష్ రెడ్డి రూ. 50 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీకి చిక్కాడు. ఈ క్రమంలో శుక్రవారం నుంచి ఆయన నివాసంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో 22 ఎకరాల వ్యవసాయ భూమి, ఓపెన్ ప్లాట్లు, విల్లా, భవనాలు సదరు అధికారికి ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ స్థిరాస్తుల మార్కెట్ విలువ రూ. 100 కోట్లకుపైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడీఈ నివాసంలో స్థిరాస్థి పత్రాలు, బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. సోదాల అనంతరం సతీష్‌రెడ్డిని రిమాండ్ కు తరలించారు.

# పార్లమెంట్ ఆమోదం పొందాకే బీసీలకు 42% రిజర్వేషన్లు

తరువాయి భాగం

1994లో ప్రధాని మోదీ లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని నేను చెప్పాను. నేను చేసిన వ్యాఖ్యలను కూడా అంగీకరించాను. కాకపోతే తేదీ, సమయం విషయంలో కొంత తేడా వచ్చింది. కిషన్‌రెడ్డి చెప్పింది నేను అంగీకరిస్తున్నా.. ప్రధానిపై తప్పుడు వ్యాఖ్యలు చేయలేదు. ఆయన హోదాను తగ్గించలేదు. అగౌరవ పరిచే విధంగా మాట్లాడలేదు అని రేవంత్ తెలిపారు.

**రాహుల్ గాంధీయే నా బాస్..**

కాంగ్రెస్ సీఎంగా నేను ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచన మేరకు నడుచుకుంటా. ఆయన మార్గదర్శకాలను తప్పకుండా పాటిస్తా. ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు, ఫిర్యాదులు చేసినా పట్టించుకోను. కేవలం రాహుల్ గాంధే నా బాస్. ఆయన చెప్పినట్టు నడుచుకుంటా. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ నాపై అనేక ఫిర్యాదులు, విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. రాహుల్ ఆదేశాల మేరకు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం ఏర్పాటు చేశాం. పీసీసీ, మంత్రివర్గ విస్తరణ అంశాల్లో కొందరు నాపై అబద్ధపు ప్రచారాలు, ఊహాగానాలు వ్యాప్తిచేసి పైశాచిక ఆనందం పొందుతున్నారు.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తాం..**

పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఎలా వస్తుందో చూడాల్సి ఉందని.. ఈ విషయంలో అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను పాటిస్తామని రేవంత్ చెప్పారు. కేటీఆర్ తానే కోర్టు అన్నట్టుగా మాట్లాడుతున్నారని, కోర్టు తీర్పు రాకముందే తీర్పులు ఇచ్చేస్తున్నారని విమర్శించారు. న్యాయ ప్రక్రియకు లోబడే ఈ విషయంలో ముందుకు వెళతామని తెలిపారు. అయితే దానం నాగేందర్ ఒక పార్టీలో గెలిచి మరో పార్టీ గుర్తుపై పోటీచేసిన రుజువులున్నాయి కదా అని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా... 'గతంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఏ పార్టీలో గెలిచారు? ఏ పార్టీలో మంత్రులుగా పనిచేశారు? నేను ఈ అంశంపై ఫిర్యాదులు చేసినా ఏం జరిగింది?' అని రేవంత్ పేర్కొన్నారు.

# ఎన్నికల కోడ్‌లేని జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్లకు గ్రీన్ సిగ్నల్



తరువాయి భాగం

దృష్టి సారించాలన్నారు. హైదరాబాద్‌లో మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయడానికి ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ ఇళ్ల నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి అవసరమైన భూసేకరణ కోసం రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపించాలని భట్టి విక్రమార్క తెలిపారు.

ప్రభుత్వ భూముల సంరక్షణ కోసం రెవెన్యూ శాఖ పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కోర్టు వివాదాల్లో ఉన్న కోట్ల రూపాయల విలువైన భూములను దక్కించుకోవడానికి ప్రత్యేక ప్రణాళిక చేసుకోవాలని, న్యాయవాదులతో నిరంతరం చర్చించాలని సూచించారు. డిజిటల్ భూముల సర్వే కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు ప్రతీ నెల సకాలంలో అద్దె చెల్లించేందుకు ఆర్థిక శాఖలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలని చెప్పారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చేందుకు విస్తృత ప్రచారం చేయాలని సమాచార, ప్రజా సంబంధాల అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. లఘు చిత్రాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని వెల్లడించారు. ఆదాయం పెంచుకునేందుకు ప్రత్యామ్నాయ వనరుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్ రామకృష్ణారావు, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్, హౌజింగ్ ఎండీ గౌతమ్, ఐ అండ్ పీఆర్ కమిషనర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట 15 మంది దుర్మరణం

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

దేశ రాజధానిలో ఘోరం జరిగింది. మహాకుంభమేళాకు వెళ్లేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసిన న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 15 మంది ప్రాణాలు కోల్పోయారు. 10 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని హుటాహుటిన సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని వార్తలొచ్చాయి. శనివారం రాత్రి 9.55 గంటలకు 13, 14వ నంబర్ ప్లాట్‌ఫామ్‌ల వద్ద ఈ తొక్కిసలాట జరిగింది. ఘటనాస్థలిలో భక్తుల బ్యాగులు, దుస్తులు, చెప్పులు చెల్లాచెదురుగా పడ్డాయి.

భయంతో జనం తమ చిన్నారులను భుజాలపైకి ఎత్తుకుని, బ్యాగులు పట్టుకుని పరుగెడుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తొక్కిసలాటకు కారణాలపై ఇంకా అధికారికంగా ఎలాంటి ప్రకటన వెల్లడి కాలేదు. అయితే ఢిల్లీ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లాల్సిన రెండు రైళ్లు ఆలస్యంగా రావడంతో అప్పటికే వేచిఉన్న భక్తులు త్వరగా ఎక్కేందుకు ప్రయత్నించడం, కిక్కిరిసిన జనం కారణంగా తొక్కిసలాట జరిగినట్టు వార్తలొచ్చాయి. ఊపిరాడక స్పృహ తప్పిన కొందరిని సమీప ఆస్పత్రులకు తరలించారు.

దాదాపు 12 మందిని లోక్‌నాయక్ జైప్రకాశ్ నారాయణ్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చినట్టు ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్ చెప్పారు. ఘటనపై రైల్వే డీసీపీ కేపీఎస్ మల్హోత్రా ట్లాడారు. "14వ నంబర్ ప్లాట్‌ఫామ్ ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగి ఉన్నప్పుడు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు అక్కడ వేచి ఉన్నారు. అదే సమయానికి రావాల్సిన స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లు ఆలస్యంగా నడుస్తున్నాయి. వాటిని ఎక్కాల్సిన ప్రయాణికులు 12, 13, 14వ నంబర్ ప్లాట్‌ఫామ్‌లపై వేచి ఉన్నారు. దీంతో ప్లాట్‌ఫామ్‌లపై జనం ఊహించనంతగా పెరిగిపోయి చివరకు 14వ నంబర్ ప్లాట్‌ఫామ్, 16వ నంబర్ ప్లాట్‌ఫామ్ ఎస్కలేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. కమర్షియల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ (సీఎంఐ) తెలిపిన వివరాల ప్రకారం రైల్వేస్ ప్రతి గంటకు 1,500 టికెట్లు విక్రయించింది. ఊహించనంతగా ప్రయాణికులు వచ్చారు.అందుకే పరిస్థితి అదుపు తప్పింది" అని డీసీపీ మల్హోత్రా చెప్పారు. ఘటనపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పరిస్థితి ఇప్పుడు అదుపులోనే ఉంది. ఘటనాస్థలికి వెంటనే రైల్వే పోలీస్, ఢిల్లీ పోలీస్, సీఆర్‌పీఎఫ్ బలగాలు వెంటనే చేరుకున్నాయి. వారాంతం కావడంతో అధికంగా వచ్చిన భక్తుల రాకపోకల కోసం అదనపు రైళ్లను నడుపుతున్నాం" అని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు.




# ప్రైవేటు స్కూళ్ల నిలువు దోపిడీ

తరువాయి భాగం

తల్లిదండ్రులు ఆందోళనకు దిగుతున్నారు.

**హయత్‌నగర్ జీ స్కూల్ వద్ద ఆందోళన**

తాజాగా హైదరాబాద్ శివార్లలోని హయత్‌నగర్‌లో ఉన్న జీ హై స్కూల్ యాజమాన్యం వచ్చే విద్యా సంవత్సరానికిగాను ఫీజులను భారీగా పెంచింది. ఒకేసారి 30 శాతం ఫీజులు పెంచడంతో తల్లిదండ్రులు స్కూల్ వద్ద ఆందోళనకు దిగారు. హైదరాబాద్‌విజయవాడ పాత రోడ్డుపై భైఠాయించారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తున్నారు. ఒకేసారి 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది 10 శాతమే పెంచుతామని యాజమాన్యం తమకు చెప్పిందని, ఇప్పుడు ఒకేసారి 30 శాతం ఫీజులు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఇప్పటికే యాజమాన్యానికి మెమోరాండం సమర్పించామని, అయినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదని చెప్పారు. ఇలా పెంచుకుంటూ పోతే ఎలా భరించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డుపై ధర్నా చేస్తుండటంతో పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది.

# కేసీఆర్‌ను కట్టడి చేయాలని చూస్తున్నారు..

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఏ కారణం లేకుండా బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న నాయకులను టార్గెట్ చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకు పంపించిన బీఆర్ఎస్ కార్యకర్త లక్కినేని సురేందర్ ను ఖమ్మం జైలులో శనివారం నాడు ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. అక్రమ కేసులతో కేసిఆర్ సైన్యాన్ని కట్టడి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని, కానీ కెసిఆర్ ని, కెసిఆర్ సైన్యాన్ని కట్టడి చేయడం ఎవరికి సాధ్యం కాదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నించకుండా తమను ఆపలేరని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలన్ని, మోసాలన్నీ ప్రజల మనసుల్లోకి వెళ్లిపోయాయని, రైతులు, విద్యార్థులు, మహిళలతో పాటు అన్ని వర్గాలు ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నాయని తెలిపారు.

14 నెలల పాలనలో రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదని అందరికీ తెలిసిపోయిందని, ఆ భయంతోనే ఎవరిని పడితే వాళ్లను కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారని చెప్పారు. గ్రామ సభల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకు సురేందర్ పై అక్రమ కేసు నమోదు చేసి జైలు పంపారని, ప్రభుత్వం నడపడం చేతగాక, పథకాలు అందించడం చేతకాక వైఫల్యాలను కప్పిపెట్టుకుంటామంటే కుదరదని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంత వరకు వెంటపడుతూనే ఉంటామ, అక్రమ కేసులకు తలొగ్గేదే లేదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని తేల్చిచెప్పారు.

**బీసీ రిజర్వేషన్ల పేరుతో కుట్ర..**

బీసీల రిజర్వేషన్ల పేరుతో పెద్ద కుట్ర జరుగుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఖమ్మంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. 46 శాతం ఉన్న బీసీలకు అదే స్థాయిలో విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు ఇవ్వాలన్న కవిత.. బీసీల విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ల కోసం ప్రత్యేక బిల్లులు పెట్టాలని డిమాండ్ చేశారు. మూడు బిల్లులు పెట్టకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేనట్టేని ఆమె అన్నారు. మీకు నిజాయితీ ఉంటే సిన్సియర్‌గా రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే మూడు బిల్లులు పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తనకు అవసరమైనప్పుడు బీజేపీ నేతలతో మాట్లాడిస్తుంటాడని ఆమె అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై కోపంతో రైతులను బాధపెడుతున్నారని పేర్కొన్నారు. బీసి రిజర్వేషన్ల సర్వే పూర్తి చేసి ఫిగర్స్ స్పష్టం చేయాలని.. బీసీ రిజర్వేషన్ల పేరుతో పెద్ద కుట్ర జరుగుతోందన్నారు. ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారు. నిజామాబాద్‌లో మంత్రే లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టాం. కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని కవిత పేర్కొన్నారు.

# రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళితే సీజ్..

విశాలభారతి, హైదరాబాద్

ఉమ్మడి కరీంనగర్‌మెదక్‌ఆదిలాబాద్‌నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వరంగల్‌ఖమ్మంనల్గొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ఎలక్షన్ కోడ్ అమలులో ఉంది. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ప్రజలు నగదుతో ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో సరైన పత్రాలు వెంట తీసుకువెళ్లకుంటే ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికలు కావడంతో పెద్దగా హడావుడి లేక కోడ్ అమలులో ఉన్న విషయం చాలా మందికి తెలియడం లేదు. సాధారణ పరిస్థితుల మాదిరిగా నగదుతో ప్రయాణం చేస్తే అధికారులు పట్టుకుని సీజ్ చేసే అవకాశాలు ఉన్నాయి. పక్కా ఆధారాలతోనే నగదును తీసుకువెళ్లాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

ఫ్రిబవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. ఎన్నికల్లో ఎవరూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా అధికారులు పకట్బందీగా నిఘాను ఏర్పాటు చేశారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దులలో, చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు మొదలయ్యాయి. నగదుతో ప్రయాణం చేయాల్సి వస్తే ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. రూ.50 వేలకు మించితే అందుకు సంబంధించిన పక్కా ఆధారాలతోనే ప్రయాణించాలి. లేదంటే ఆ నగదును సీజ్ చేసే అధికారం ప్రభుత్వ అధికారులకు ఉంటుంది. నగదు మాత్రమే కాదు వెండి, బంగారం లాంటి ఆభరణాలు కొనుగోలు చేసినా, ఇతర వస్తువులు కొనుగోలు చేసి పట్టణాల నుంచి గ్రామాలకు తీసుకువస్తున్నా సంబంధిత రసీదులు ఉండాలి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కాబట్టి ఎక్కువగా వివాహ సామగ్రి, చీరలు, బంగారం, వెండి లాంటివి కొనేందుకు పెద్ద మొత్తంలో నగదును వెంట తీసుకుని నగరాలకు వెళ్తుంటారు. అలాంటి వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. పెద్దగా నిఘా లేదు కదా అనుకుని ఏమరపాటుగా ఉంటే మాత్రం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలకు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు జంట నగరాల నుంచి నిత్యం పెద్ద ఎత్తున రాకపోకలు జరుగుతుంటాయి. ఆర్టీసీ బస్సులు, రైళ్లు, ప్రైవేటు బస్సులు, ద్విచక్రవాహనాలు, కార్లు లాంటి వాహనాల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వీటిలో ప్రయాణించేవారు నగదు తీసుకెళ్లే సమయంలో జాగ్రత్త వహించకుంటే ఆ నగదు అవసరాలకు ఉపయోగపడకుండా సీజ్ అయ్యే ప్రమాదం ఉంది.




# మరో 119 మంది వెనక్కు

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన వలసదారులను ఆ దేశం డీపోర్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండో విడత భారత అక్రమ వలసదారులను శనివారం అమెరికా మిలటరీ విమానంలో అమృత్‌సర్‌లో దిగింది. ఈ విమానంలో 119 మంది భారతీయులను స్వదేశానికి తీసుకొని వచ్చారు. యూఎస్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన సీ17 గ్లోబ్‌మాస్టర్ ఎయిర్ క్రాఫ్ట్ అమృత్‌సర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో రాత్రి 11.40కు ల్యాండ్ అయ్యింది. ఫిబ్రవరి 5న వచ్చిన విమానాన్ని టెక్నికల్ ఎయిర్ పోర్టులో దించగా.. ఈ విమానాన్ని సివిల్ ఎయిర్‌పోర్టులో దించినట్లు తెలిసింది. ఇందులో 67 మంది పంజాబీలు, 33 మంది హర్యానాకు చెందిన వలసదారులు ఉన్నారు. వీరితో పాటు గుజరాత్ నుంచి 8, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ముగ్గురు, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్ నుంచి ఇద్దరు చొప్పున ఉన్నారు. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. కాగా, అక్రమ వలసదారులను రిసీవ్ చేసుకోవడానికి పంజాబ్ సీఎం భగవంత్ మన్, ఇమ్మిగ్రేషన్ అధికారులతో పాటు.. బంధువులు, కుటుంబ సభ్యులు కూడా ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.

# మరోసారి సమగ్ర కులగణన

- నేటి నుంచి వివరాల నమోదు
- స్వచ్ఛందంగా వివరాలివ్వాలని సర్కారు విజ్ఞప్తి
- టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే అధికారులే వస్తారని వెల్లడి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

సమగ్ర కులగణనలో పాల్గొనని వారి వివరాలను అధికారులు నేటి నుంచి నమోదు చేయనున్నారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన వారి వివరాలను నమోదు చేసుకోనున్నారు. కులగణన కోసం 04021111111 టోల్ ఫ్రీ నంబరు అందుబాటులో ఉంటుందని ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చి మరీ సంబంధిత వివరాలను నమోదు చేస్తారని వెల్లడించారు.

గ్రామీణ ప్రాంతాలకు ఎంపీడీవో కార్యాలయాలు, పట్టణాలు, నగరాల్లో వార్డు, డివిజన్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాలకు వెళ్లి సమగ్ర కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. కార్యాలయాల్లో శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు అందుబాటులో ఉంటారన్నారు. కులగణన సర్వే వెబ్‌సైట్ https://seeepcsurvey.cgg.gov.in నుంచి అప్లికేషన్ ఫారం డౌన్‌లోడ్ చేసుకుని దానిని నింపి ప్రజాపాలన సేవా కేంద్రాల్లో అందజేయవచ్చని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల 56 వేల 323 కుటుంబాల వివరాలు గతంలో జరిగిన కులగణనలో నమోదు కాలేదని ఈ సందర్భంగా సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు.

ఫోన్ చేసిన వాళ్లు ఇచ్చిన అడ్రస్ ప్రకారం ఎన్యుమరేటర్లు వారి ఇంటికి వెళ్లి కులగణన చేయనున్నారు. మొబైల్ నంబర్ తో సెర్చ్ చేసి సంబంధిత వ్యక్తి పాత డేటా బేస్ లో నమోదు అయ్యారా లేదా అనే వివరాలను పరిశీలించనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ ను స్వీకరించి ఆయా జిల్లా కలెక్టర్లకు ఫార్వార్డ్ చేయనున్నారు. మరోవైపు ఎంపీడీవో కార్యాలయం, వార్డు ఆఫీసులకు వెళ్లి కూడా వివరాలు నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. తెలంగాణలో 3,56, 323 కుటుంబాలు కులగణన సర్వేలో పాల్గొనలేదని అధికారులు చెప్పారు.



**నేలచూపులు, నిట్టూర్పులే తప్పా హైదరాబాద్ కేంద్రంగా గడిచిన ఏడాది కాలంగా నిర్మాణ రంగానికి ఒరిగేది లేకుండా పోయింది. ఓవైపు కూల్చివేతలు, మరోవైపు అస్పష్టమైన పాలనా విధానాలతో పెట్టుబడులు హైదరాబాద్ అంటేనే జంకే పరిస్థితులు దాపురించాయి. ఇక కోట్లలో జరిగే భూ విక్రయాలు నేలచూపులు చూస్తున్న ఈ తరుణంలో... నిర్మాణ అనుమతులు కూడా అధ: పాతాళానికి చేరుతున్నాయి. దీంతో ఒకప్పుడు రియల్ రంగంలో రారాజుగా నిలిచిన హైదరాబాద్ ఇప్పుడూ నిర్మాణరంగం బెంబెలేత్తిపోయేలా మారింది. అమ్మేవారున్నా... కొనేవారు లేక విలవిలలాడిపోతుంది. బడా నిర్మాణ సంస్థలతోపాటు, చోటా, మోటా బిల్డర్లు కూడా కళ్లు తేలేసే పరిస్థితులు ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్ సతమతమైపోతుంది. దీంతో మొన్నటిదాకా కళకళలాడిన సిటీ రియల్ ఎస్టేట్ కుదేలైపోతుంది. ఎంతోమందికి ఉపాధినిచ్చిన ఈ రంగమే ఇప్పుడు లక్షలాది మంది రియల్‌ఎస్టేట్ బ్రోకర్లను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోంది.**

# అధ: పాతాళానికి నిర్మాణరంగం

## భారీగా పడిపోతున్న క్రయవిక్రయాలు

## గణనీయంగా తగ్గిన గృహ నిర్మాణ అనుమతులు

## ఏడాది కాలంగా ఇంకా కోలుకోలేని రియాల్టీ

## కోర్ సిటీతోపాటు, శివారుల్లోనూ తగ్గిన అనుమతులు

**విశాలభారతి, హైదరాబాద్ :**

ఏడాదిన్నర కిందట వరకు హైదరాబాద్ రియల్‌ఎస్టేట్ మార్కెట్ దేశంలోనే అన్ని మెట్రో నగరాలకు ధీటుగా ఎదిగింది. కానీ ప్రస్తుతం రోజులు మారినంత వేగంగా పరిస్థితులు అధ్వాన్నంగా మారిపోవడంతో సిటీ కేంద్రంగా నిర్మాణ రంగం నేల చూపులు చూస్తోంది. అమ్మేందుకు బిల్డర్లు సిద్ధంగా ఉన్నా...కొనేవారు లేక విలవిలలాడిపోతుంది. ఈ సంక్షోభం భారీ నిర్మాణ సంస్థలకే అనుకుంటే పొరపాటే, చిన్నపాటి బిల్డర్ల నుంచి మొదలుకుంటే లక్షలాదిగా ఉన్న రియల్‌ఎస్టేట్ బ్రోకర్ల జీవితాన్ని ప్రశ్నార్థకంగా మారుతోంది. దీంతో క్రయవిక్రయాలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమైతున్నారు. హైడ్రా, బహిరంగ మార్కెట్లో ఉన్న స్థబ్ధత వంటి కారణాలు ఉన్నా... ప్రస్తుతం ఉన్న ఆందోళనకరమైన పరిస్థితులతో సామాన్యులు సొంతింటి కలను వాయిదా వేసుకుంటున్నారు. ఈ విషయం అనేక సర్వేల్లో వెల్లడైతున్నా... ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగకపోవడంతో ఇప్పుడు మార్కెట్ వర్గాలను కూడా కలవరపెడుతోంది. కనీసం నిర్మాణ రంగ సంస్థలైన కొంత ఉత్సాహం తెచ్చుకుని మార్కెట్‌ను ప్రభావితం చేసేందుకు సిద్ధమైతున్నా... ప్రభుత్వ సహకారం లేక నేలచూపులు చూస్తోంది. తాజాగా అధికారిక లెక్కలను పరిశీలించినా నిర్మాణరంగం క్రమంగా కుదేలవుతున్నదనే సంకేతాలు తెలిసిపోతుంది.

### నిర్మాణ రంగానికి ఆయువుపట్టు... శివారు ప్రాంతాలు

కోర్ సిటీలో విపరీతంగా పెరిగిన భూముల ధరలతో... రియల్ ఎస్టేట్ రంగం గడిచిన ఐదారేళ్లుగా కేవలం శివారు ప్రాంతాలను అనుకుని విస్తరిస్తోంది. ఈ క్రమంలోనే ఓఆర్ఆర్ అవతలి వరకు విస్తరించి భూముల ధరలకు క్రమంగా పెరుగుతూ పోయింది. అలా గడిచిన కొంతకాలంగా రియల్ ఎస్టేట్ రంగానికి హైదరాబాద్ స్వర్గధామంలా నిలిచినా... ప్రస్తుతం పరిస్థితులన్నీ తలకిందులయ్యాయి. దీంతో గడిచిన రెండేళ్లలో సిటీ చుట్టూ ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నిర్మాణ అనుమతుల్లో భారీ తగ్గుదల నమోదు కావడం నేలచూపులు చూస్తున్న రియాలిటికి నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో ప్రపంచవ్యాప్తంగా ఎదురైన కోవిడ్ సంక్షోభంలోనూ హైదరాబాద్ కేంద్రంగా రియల్ క్రయవిక్రయాలు తారా స్థాయికి చేరుకున్నాయి. కానీ ఇప్పుడు కొనండి బాబూ అంటూ బిల్డర్లు వెంటపడే పరిస్థితి వచ్చినా... కొనుగోలుదారులు ధైర్యం చేసే పరిస్థితి లేకుండా పోయింది. కొవిడ్ సమయంలోనూ లావాదేవీలు, క్రయవిక్రయాలు కొంత మందగించాయే తప్పా... తగ్గిన దాఖాలాలు లేవు. కానీ గడిచిన ఏడాదిన్నర కాలంగా నిర్మాణ రంగంలో డౌన్ ఫాల్ కొనసాగుతూనే ఉంది. దుకే కొవిడ్ సమయంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మాణ రంగానికి లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఇవ్వాల్సి వచ్చింది. కానీ కొవిడ్ ఒక స్పీడ్ బ్రేకర్‌గా మారి రియల్ దూకుడును తగ్గించే ప్రయత్నం చేసినా... ఏమాత్రం ప్రభావం చూపక చేతులెత్తేసింది.

### అనుమతులకు ఆదరణ కరువు..

రాష్ట్రంలో 2023 డిసెంబర్ నెలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2024 ఆదిలో రియల్ ఎస్టేట్ నిర్మాణ రంగాల్లో కొంతమేర స్తబ్ధత నెలకొన్నా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ ఇలాగే ఉంటుందని నిపుణులు సైతం అనుకున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత హైదరాబాద్ రియల్‌ఎస్టేట్ నిర్మాణ రంగాలు ఊపందుకుంటుందని అంతా అంచనా వేశారు. కానీ చిచ్చరపిడుగు లాంటి కార్యకలాపాలతో హైడ్రా నిర్మాణ రంగాన్ని కోలుకోలేని దెబ్బ కొట్టింది. నిర్మాణాల కూల్చివేతలు చేపట్టడంతో రేపో మాపో కోలుకుంటుందనే సమయంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలో స్తబ్ధత నెలకొంది. దీనికితోడు తగ్గుదల మొదలు కాగా, 2023తో పోలిస్తే 2024లో 16 స్థానిక సంస్థల పరిధిలో అనుమతులు ఏకంగా 36% తగ్గినట్టుగా చెబుతున్న గణాంకాలే ప్రస్తుతం సిటీలో ఉన్న ఆందోళనకరమైన పరిస్థితులకు అద్దం పడుతోంది. ఆ కారణంగానే రియల్టర్లు, బిల్డర్లు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి, సమయానికి అమ్ముకోలేక, తీసుకువచ్చిన అప్పులను నిర్ణీత గడువులోగా కట్టలేక ఒత్తిడికి లోనైతున్నారు. ఈ క్రమంలో ఎంతో మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు బలవన్మరణాలకు పాల్పడాల్సిన దుస్థితి వచ్చింది.

### దిద్దుబాటు చర్యలు ఇంకేప్పుడూ...

మేకపోతు గాంభీర్యంతో హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగం ఉందని ప్రభుత్వ, రియల్ ఎస్టేట్ రంగ సంస్థలు చెబుతున్నా... క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులే ఉన్నాయి. ముఖ్యంగా ఇప్పటికీ ఆగని హైడ్రా కూల్చివేతలు, ఆక్రమణల పేరిట పేదల ఇండ్లే లక్ష్యంగా మూసీ పరివాహక ప్రాంతంలో జరిగిన విధ్వంసకరమైన పరిస్థితుల నుంచి బయటపడేలా ప్రభుత్వం ఇప్పటికీ దిద్దుబాటు చర్యలకు దిగడం లేదు. కనీసం సంబంధిత విభాగానికి చెందిన స్టేక్ హోల్డర్లతోనైనా మార్కెట్‌ను బయటపడే మార్గాలను కూడా అన్వేషించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనీ చెప్పుకోవాలి. ఇక ప్రభుత్వం కూడా కనీసం వాస్తవ పరిస్థితులను అంచనా వేసుకుని ఉద్దీపనలు, ప్రోత్సాహాలు, నిర్మాణ ఛార్జీల రద్దు వంటి వైవిధ్యమైన విధానాలను అమలు చేయాల్సి పోయి... కేవలం హైడ్రా పేరిట ఆక్రమణలు అంటూ దాడులు చేస్తుందే తప్పా... నగరంలో మార్కెట్‌ను సుస్థిరపరిచే విధానాలను అమలు చేయడం లేదు. దీంతోనే హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ లో పెట్టుబడులు అంటేనే పెట్టుబడిదారులు భయాందోళనలకు గురైపోతున్నారు



### శివారుల్లో రియల్ బేజారు...

నగరం చుట్టూ ఉన్న స్థానిక సంస్థల పరిధిలో 2021, 2022 సంవత్సరాల్లో అనుమతుల సంఖ్యను చూస్తే ఇదే విషయం అర్ధమవుతుంది. ప్రధానంగా 2021 నుంచి 2022కు అనుమతులు 22% మేర పెరిగితే... ఇప్పుడు మార్కెట్ లేక శివారులన్నీ బేజారైపోతున్నాయి. దీంతో నిర్మాణ కార్యకలాపాలు లేక, కొనేందుకు వచ్చే కొనుగోలుదారుల సందడి లేక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులన్నీ బోసిపోతున్నాయి. ఏడాది కాలంగా రియల్ ఎస్టేట్ మళ్లీ యథా స్థానానికి వస్తుందనే ఆశాభావంతోనే ఉన్నారు. కానీ ఎదురుచూపులు తప్పా... నేలకు జారిపోతున్న రియాలిటీని కాపాడలేకపోతున్నారు. ఇక ప్రభుత్వం కూడా తొందరపాటు నిర్ణయాలతో మార్కెట్ మరింత బేజారైపోతుందని, లేనిపోని భయాందోళనలతో అమ్మకాలు మందగించేలా ప్రభావం చూపుతున్నాయి.



### ఇలాగే కొనసాగితే... మార్కెట్ మరింత దారుణం

**ప్రస్తుతం శివారు ప్రాంతాల వరకు రియల్ ఎస్టేట్ రంగంలో అమ్మకాలు పడిపోయాయి. కానీ ప్రభుత్వం శివారులో అమ్మకాలను ప్రోత్సహించేలా మౌలిక వసతులపై దృష్టి పెట్టలేదు. కనీసం హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రభావితం చేసేలా పెట్టుబడుల పేరిట హడావుడి చేస్తుందే తప్పా... మార్కెట్‌ను యథాస్థితికి తీసుకువచ్చేందుకు ఏమాత్రం కృషి చేయడం లేదు. దీంతో మార్కెట్ మరింత కఠినమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందనే అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. కనీసం హైడ్రా పేరిట కూల్చివేతలు చేపట్టడం కంటే నగరంలో నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించే ప్రణాళికలను అమలు చేస్తే గానీ మార్కెట్ కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు.**

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
16.02.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
4
vishalabharathi Telugu Daily

## టీమిండియా తదుపరి కెప్టెన్‌గా బుమ్రా

విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో: టీమిండియా తదుపరి టెస్ట్ కెప్టెన్‌గా స్పీడ్ గన్ జస్ప్రీత్ బుమ్రా ఎంపికైనట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే, బీసీసీఐ ఈ నిర్ణయంపై ఓ కొలిక్కి వచ్చిందని, ప్రకటించడమే మిగిలివుందని కథనాలు వస్తున్నాయి. బుమ్రాకు బాధ్యతలు అప్పగించేందుకు ప్రస్తుత సారథి రోహిత్‌ను బీసీసీఐ పెద్దలు ఒప్పించారని సమాచారం. ప్రస్తుతం రోహిత్ ఛాంపియన్స్ ట్రోఫీపైనే దృష్టి పెట్టాడు. తరువాత ఐపీఎల్ ప్రారంభమవుతుంది. రాబోవు మూణ్నెల్లు ఈ రెండింటికే గడిచిపోతాయి. జూన్‌లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నెక్స్ట్ సర్కిల్ ప్రారంభమవుతుంది. అప్పుడు రోహిత్ టెస్టుల్లో కొనసాగుతాడా? లేదా? అనేది ఇంకా తెలియదు. ఇటీవల అతని ఫామ్ చూస్తే.. కొనసాగడం దాదాపు అసంభవమే. గెలిచినా.. గెలవకున్నా.. ఛాంపియన్స్ ట్రోఫీ ముగిశాక అతడు రిటైర్మెంట్ ప్రకటించొచ్చని తెలుస్తోంది. ఈ క్రమంలోనే బీసీసీఐ ముందస్తుగా కెప్టెన్‌ను సిద్ధం చేసిందన్నది వస్తున్న వార్తల సారాంశం. తదుపరి టెస్ట్ కెప్టెన్‌గా బుమ్రా ఎంపిక సరైనదే అయినప్పటికీ, పదే పదే గాయాల బారిన అతడు ఎన్ని మ్యాచ్‌ల్లో జట్టుకు అందుబాటులో ఉంటాడనేది అసలు ప్రశ్న. బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ చివరలో వెన్ను నొప్పి గాయంతో దూరమైన బుమ్రా.. ఇటీవల ఇంగ్లండ్‌తో ముగిసిన టీ20, వన్డే సిరీస్‌లకు దూరమయ్యాడు. ఛాంపియన్స్ ట్రోఫీ నుండి తప్పకున్నాడు. బహుశా..! అతడు కోట్లు కురిపించే ఐపీఎల్ నాటికి జట్టుతో కలవచ్చు. ప్రస్తుతం బుమ్రా భారత టెస్టు జట్టుకు వైస్ కెప్టెన్.

# GENERAL NEWS



## కూకట్పల్లి నియోజకవర్గం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నూతన కార్యవర్గం నియామకం

కూకట్ పల్లి, విశాలభారతి:

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(143) కూకట్పల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాన్ని మారుతి సాగర్ లు ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా నిమ్మల శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శిగా కోహీరు నాగరాజు, కోశాధికారిగా సదా మహేష్ లను నియమిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నియామక ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.మారుతి సాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్కే దయాసాగర్ లు త్వరలో మిగతా పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. జర్నలిస్టు సంక్షేమ కోసం గత పది సంవత్సరాలుగా టీయూడబ్ల్యూజే 143 ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. కూకట్పల్లిలో అర్హులైన జర్నలిస్టులందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందేలా, వారి సమస్యల పరిష్కారానికి మన యూనియన్ తరపున కృషి చేయాలని కోరారు.

## ప్రభుత్వ సూచనలను ఉల్లంఘిస్తే ఇసుక క్వారీ యజమానులపై కట్టిన చర్యలు

వాజేడు, విశాలభారతి:



మండల పరిధిలో రాంపురం, భీమవరం ఇసుక క్వారీని సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ డిపార్ట్మెంట్ మరియు పేరూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ గుర్రం కృష్ణ ప్రసాద్ సందర్శించారు. ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఇసుక రవాణా దారులు లారీ యొక్క సరియైన డిడి లేకుండా అక్రమంగా ఇసుక ఒక లారీ బదులు మరొక్క లారీలో తరలిస్తున్న లారీ రవాణా దారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ సూచనలను ఉల్లంఘిస్తూ ఇసుక క్వారీ యజమానులు జె సి బి లోడింగ్ చార్జీలు అక్రమంగా వసూలు చేసిన మరియు అక్రమ ఇసుక రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బీసీల్లో ముస్లింలను కలిపితే ఒప్పుకోం

- రాష్ట్ర తీర్మానాన్ని కేంద్రం ఆమోదించదు
- కులగణన తప్పుల తడక
- రాహుల్‌గాంధీ కులమేంది..?
- ప్రధానిపై అవాకులు, చవాకులు సరికాదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రధానమంత్రి మోదీది ఏ కులం? రాహుల్ గాంధీది ఏ మతం అనే అంశాలపై చర్చకు తాము సిద్ధమని, ఇదే అంశాన్ని రెఫరెండంగా భావిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లోకి వెళదామా? అంటూ కాంగ్రెస్ పార్టీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. కుల గణన తప్పుల తడక, బీసీ జాబితాలో ముస్లింలను కలపడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత నెలకొందని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రధాని కులంపై సీఎం రేవంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో శనివారం టూరిజం ప్లాజాలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రిజర్వేషన్లు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని మోడీపై చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.

మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమన్న బండి సంజయ్ ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి కేంద్రానికి పంపితే ఆమోదించే ప్రసక్తే లేదని అన్నారు. ఈ విషయం తెలిసి కూడా కాంగ్రెస్ డ్రామాలాడుతోందని ధ్వజమెత్తారు. ప్రజలకు, బీసీ సంఘాలకు ఈ విషయం తెలుసునని వ్యాఖ్యానించారు. పది శాతం ఉన్న ముస్లింలను బీసీల్లో కలిపితే కేంద్రం ఒప్పుకోదని అన్నారు. బీసీలను 51 శాతం నుంచి 46 శాతానికి తగ్గించారని ఆయన మండిపడ్డారు. ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వమే మద్దతు ఇస్తోందని ఆరోపించారు. హిందువుల జనాభా తగ్గించి ముస్లిం జనాభా పెంచి చూపిస్తున్నారని బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ప్రధానిపై అవాకులు, చవాకులు సరికాదు

మనిషి పుట్టిన వెంటనే కులం పేరు పెడతామా? రేవంత్ రెడ్డికి అట్లనే చేశారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ప్రధానిపై మాట్లాడేటప్పుడు అవాకులు, చవాకులు మాట్లాడతారా? అని చెబుతూ ఈ విషయాన్ని రేవంత్ విజ్ఞతకే వదిలేస్తున్నా అన్నారు. మోదీ ముమ్మాటికీ బీసీనేనని బండి సంజయ్ పేర్కొన్నారు. 1994లోనే గుజరాత్‌లోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే మోదీ కులాన్ని బీసీ జాబితాలో చేర్చిందని గుర్తు చేశారు. ఈ దేశంలోని వెనుకబడిన వర్గాలు, అగ్రవర్ణ పేదలు, దళిత జాతి మొత్తం మోదీ తొలిసారి ప్రధానమంత్రి కాగానే సంబురాలు చేసుకున్నారని అన్నారు. మోదీ సైతం తన తొలి కేబినెట్‌లో 27 మంది బీసీలను మంత్రులుగా చేశారని అన్నారు. అలాగే 12 మంది దళితులను, 8 మంది ఎస్టీలను మంత్రులుగా చేశారని వివరించారు. మరి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఇద్దరు మాత్రమే బీసీలు ఉన్నారని అన్నారు. కుల గుణన సర్వేలో 46 శాతం మంది బీసీలున్నట్లు మీ ప్రభుత్వం లెక్క తేల్చిందని, అంతకుముందు కేసీఆర్ హయాంలో సర్వే చేస్తే 51 శాతం బీసీలున్నట్లు తేల్చారని చెప్పారు.ఈ లెక్కన మీ ప్రభుత్వంలో ఎంత మంది మంత్రులుండాలి? మరి మీరు ఎంత మందికి అవకాశం కల్పించారు? అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విరుచుకుపడ్డారు. అసలు మోదీ కులం గురించి చర్చించాల్సిన అవసరం ఏముంది? ఆ విషయానికొస్తే రాహుల్ గాంధీ కులం, మతం, జాతి గురించి చర్చ చేయాలని అన్నారు. ఎందుకంటే రాహుల్ గాంధీ తాత ఫిరోజ్ ఖాన్, ఆయన తల్లి సోనియాగాంధీ క్రిస్టియన్ అని అన్నారు. ఆమె ఇటలీ దేశస్తురాలైనప్పుడు మరి రాహుల్ ఏ కులమని ప్రోత్సహిస్తున్నారని నిలదీశారు. రాహుల్ కు ఒక కులం లేదు, మతం లేదు, జాతి లేదు. మరి అటువంటి చర్చ చేయాలంటే టెన్ జన్ పథ్ నుండే రాహుల్ కులం, మతం గురించి చర్చ చేయాల్సి ఉంటుందని అన్నారు. రాజాసింగ్ హిందూ ధర్మం కోసం పోరాడే నాయకుడని పేర్కొన్నారు. ఆయన ధర్మ పోరాటంలో ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఆయన ఎప్పుడూ మా పార్టీ వారేనని చెబుతూ రాజాసింగ్‌కు అభ్యంతరాలుంటే అంతర్గతంగా మాట్లాడాలి తప్ప మీడియాకు ఎక్కడం సరి కాదని హితవు పలికారు.

## విశ్వ గోర్ బంజారా జాతి ఆరాధ్య దైవం సేవాలాల్

- సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా శోభాయాత్ర

తొర్రూరు, విశాలభారతి:



ప్రపంచ దేశాలలో ఉన్న బంజారాల విశ్వ గురువు, ఆధ్యాత్మికవేత్త, గొప్ప సంఘసంస్కర్త, ఆరాధ్య దైవం బాల బ్రహ్మచారి సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అని డిఎంహెచ్వో డాక్టర్ మురళీధర్ అన్నారు. సేవాలాల్ 286వ జయంతి వేడుకల సందర్భంగా తొర్రూరు పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సంస్కృతి సాంప్రదాయా సంప్రదాయ బద్దంగా ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పట్టణ కేంద్రంలో శోభాయాత్రను నిర్వహించారు.ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ అడవి బిడ్డల ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక, దృక్పథం, సామాజిక సంస్కృతిక జీవన విధానాన్ని కాపాడేందుకు సేవాలాల్ మహారాజ్ జీవితాంతం పోరాటం సాగించారని అన్నారు. సేవాలాల్ మహారాజ్ అన్ని జాతుల ప్రజలకి ఆదర్శప్రాయుడని, ప్రతి ఒక్కరూ సేవాలాల్ ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాలోతు సురేష్ బాబు మాట్లాడుతూ పిలవగానే బంజారా జాతి ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, బంజారా ప్రజలు తండోపతండాలుగా వచ్చి తొర్రూర్ లో సేవాలాల్ మహారాజ్ జయంతి శోభాయాత్రను ఘనంగా నిర్వహించడం జాతి ఐక్యతను సంస్కృతి సాంప్రదాయాలను కట్టుబొట్లను కాపాడుకోవడానికి నిదర్శనం అని అన్నారు.రాష్ట్ర మంత్రివర్గంలో బంజారాలకు చోట కల్పించాలని అన్నారు. పాలకుర్తిలో సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు.తొర్రూర్ లో బంజారా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోతు బిక్షపతి నాయక్, కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సోమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ తొర్రూరు మండల అధ్యక్షులు సుంచు సంతోష్, నాయకులు జై సింగ్ నాయక్, పాడియా రమేష్, జాటోత్ రమేష్ ,జాటోతు సాయి కృష్ణ, ఈదునూరి ప్రసాద్ ,టిడిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గూగులోతు విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కెసిఆర్ పుట్టినరోజు గుర్తుగా మొక్కలు నాటుదాం

- నల్గొండ ఉమ్మడి జిల్లా డిసిసిబి డైరెక్టర్ దొండపాటి అప్పి రెడ్డి

నల్గొండ, విశాల భారతి:

బిఆర్ఎస్ అధినేత రాష్ట్ర తొలి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 17 న ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, కెసిఆర్ కు కానుక ఇవ్వాలని డి సి సి బి డైరెక్టర్ దొండపాటి అప్పి రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నేరేడుచర్ల బిఆర్ఎస్ పట్టణ ఆఫీస్ నందు హరితసేన హుజూర్ నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఇంజమూరి రాజేష్ ఆధ్వర్యంలో,వృక్షార్చన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త జోగినపల్లి సంతోష్ కుమార్ నిర్వహించే వృక్షార్చనలో భాగంగా, మున్సిపల్ పరిధిలో ప్రతి వార్డులు, మరియు గ్రామాల్లోని యువత పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ప్రతి ఒక్కరు మూడు మొక్కలు నాటాలని పిలుపునిచ్చినారు. నాటిన మొక్కలు సంరక్షణ బాధ్యతను వారే తీసుకోవాలని కోరారు.బిఆర్ఎస్ హయాంలో కేసీఆర్ చేపట్టిన హరితహారం లో కోట్లాది మొక్కలు నాటడంతో నేడు తెలంగాణలో పచ్చదనం పెరిగింది అన్నారు.అడవుల విస్తీర్ణం పెరగడంలో కేసిఆర్ కృషి ఎంతో ఉందని అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నాగెండ్ల శ్రీధర్ బాబు,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాపాలు నవీన్ కుమార్,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు,అరిబండి సురేష్ బాబు,పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరు సైదులు, లింగయ్య, మాజీ గ్రంథాల చైర్మన్ గుర్రం మార్కండేయ, చిట్యాల శ్రీనివాస్, షేక్ హుస్సేన్, ఇనుపాల పిచ్చిరెడ్డి,శ్రీను నాయక్,శంకర్, తదితరులు పాల్గొన్నారు.



## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

- 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్న చిన్న నాటి స్నేహితులు

శాలిగౌరారం, విశాలభారతి:

మండల పరిధిలోని ఊట్కూరు గ్రామానికి చెందిన గుండ్ల వెంకయ్య అనారోగ్యం తో ఇటీవలె మరణించారు.ఇంటి పెద్ద దిక్కు కోల్పోయిన బాధ లో ఉన్న వెంకయ్య కుటుంబానికి అయన కుమారుడు గుండ్ల జానయ్య చిన్న నాటి స్నేహితులు అండగా నిలబడ్డారు. శనివారం గుండ్ల వెంకయ్య పెద్ద కర్మ లో పాల్గొన్న జానయ్య చిన్న నాటి స్నేహితులు 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో వేముల లక్ష్మణ్,మొదాల రమేష్,కప్పల వెంకన్న,చిత్తలూరి శ్రీను, మహేశ్వరం మహేష్ పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక మార్గదర్శి సేవాలాల్

- పారిశ్రామికవేత్త ప్రసాద్ రెడ్డి
- జయంతి వేడుకలకు హాజరు
- సామాజిక అభివృద్ధి లక్ష్యంగా ముందుకు

జహీరాబాద్,విశాలభారతి:

బంజారాల ఆరాధ్యదైవం, సంఘ సంస్కర్త, జాతి ఉన్నతికి కృషి చేసిన ఆధ్యాత్మిక మార్గదర్శి శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ అని జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ యువ నాయకులు కె.ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం పిచేర్యాగడి పాత,కొత్త తండాలలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ గొప్ప ఆధ్యాత్మిక మార్గదర్శని ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. తండాలకు అవసరమయ్యే సొంత నిధులను ఇప్పటికే ఖర్చు చేస్తున్నానని పేర్కొన్నారు. అంతకుముందు ఆయనకు బంజారా ఆటపాటలతో గ్రామస్తులు తాండవాసులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో కోహిర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్, నాయకులు వాగుల శేఖర్,అనంతరాం,ఫక్కు సింగ్, రవి,మంగు, అనంతరం,రాథోడ్ సంజీవ్ కుమార్,మేఘునాథ్,తూకారం తదితరులు పాల్గొన్నారు.



## మల్క కొమరయ్యకు మరో రెండు సంఘాల మద్దతు

- ఫస్ట్ ప్రైయార్టీ ఓటేసి గెలిపించాలని టీచర్లకు విజ్ఞప్తి

విశాలభారతి,హైదరాబాద్:

బీజేపీ కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్యకు మరో రెండు టీచర్ల సంఘాలు మద్దతు ప్రకటించాయి. హైదరాబాద్లో శనివారం ఈ మేరకు తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సిములు గౌడ్, గణేష్ తదితరులు తమ మద్దతు లేఖను అభ్యర్థి మల్క కొమరయ్యకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ సమస్యలన్నీ మల్క కొమరయ్యతోనే పరిష్కారం అవుతాయనే నమ్మకంతో తాము మద్దతిస్తున్నట్టు వెల్లడించారు. ఆయన మూడు దశాబ్దాలుగా విద్యా వ్యవస్థలో ఉన్నారని గుర్తుచేశారు. మరోపక్క తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) కూడా మల్క కొమరయ్యకు మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టీయూటీఎఫ్ ప్రెసిడెంట్ రామినేని వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ లచ్చుమల్ల వెంకన్న మద్దతు లేఖను ఆయనకు అందించారు. టీచర్ల సమస్యలపై మండలిలో ప్రశ్నించే గొంతుక అవసరమని, అది కేవలం మల్క కొమరయ్యతో సాధ్యమవుతుందని వారు చెప్పారు. కొమరయ్యను గెలిపించాలె మున్నూరుకాపు మహాసభ కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్క కొమరయ్యకు తెలంగాణ రాష్ట్ర మున్నారుకాపు మహాసభ మద్దతు ప్రకటించింది. మున్నూరుకాపు కులానికి చెందిన విద్యావేత్త కొమరయ్య గెలుపునకు బీసీలంతా ఒక్కటికావాలని, ఆయన్ను ఎమ్మెల్సీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చింది.



# మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- గ్రీన్ ఇండియా చాలెంజ్ వృక్షార్చన కార్యక్రమంలో మేము సైతం
- 17న కేసీఆర్ పుట్టినరోజును ఘనంగా నిర్వహిద్దాం
- కల్వకుర్తి నియోజకవర్గంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ వృక్షార్చన పోస్టర్ ఆవిష్కరణ

**ఆమనగల్లు,విశాలభారతి :**

తెలంగాణ జాతిపిత, అభివృద్ధి ప్రదాత, మాజీ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి పుట్టినరోజును పురస్కరించుకొని ఈ నెల 17న, గ్రీన్ ఇండియా చాలెంజ్ రూప కర్త జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపుమేరకు మొక్కలు నాటే వృక్షార్చన కార్యక్రమ పోస్టర్ ను, తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్,కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కల్వకుర్తి ఇంచార్జ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మరియు ఇతర నేతలతో కలిసి ఆవిష్కరించారు. సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే నాయకుడు కెసిఆర్ గారి జన్మదిన సందర్భంగా దేశవ్యాప్తంగా వృక్షార్జన కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన నాటినుండి వాతావరణంలో సమతుల్యతను కాపాడడంలో మాజీ ఎంపీ సంతోష్ కుమార్ గారి కృషి వెలకట్టలేనిదని అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. వాతావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కొరకై శ్రమిస్తున్న లక్ష్మీ నర్సింహ్మా రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు విజితా రెడ్డి,దశరథ్ నాయక్,పగడాల రవి తేజ,నర్సింహ గౌడ్,అనురాధ పత్యనాయక్ మాజీ ఎంపీపీలు నిర్మల,శ్రీనివాస్ యాదవ్, జైపాల్ నాయక్,మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,విజయ్ గౌడ్,వైస్ ఎంపీపీ ఆనంద్, గోవర్ధన్ గుప్తా,ప్యాక్స్ చైర్మన్ వెంకటేష్ గుప్తా, మండల అధ్యక్షులు కంబాల పరమేష్,శంకర్ యాదవ్,జైపాల్ రెడ్డి,పుట్ట రాంరెడ్డి,ఎంపీటీసీలు లచ్చిరామ్ నాయక్,రమేష్ సర్పంచులు శ్రీను నాయక్,అంబల్ల జంగయ్య నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఖలీల్, సూర్యప్రకాష్, లాలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



**దేవరుప్పుల, విశాలభారతి:**

శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి వేడుకలను దేవరుప్పుల మండలం,ధరావత్ తండా గ్రామంలో నిర్వహించన గిరిజనులు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు కునుసోత్ బిక్కు నాయక్, సేవాలాల్ సేన సలహాదారుడు స్వామి నాయక్, ధరావత్ రవీందర్ నాయక్, బానోత్ గేమా నాయక్, సాయికుమార్, కీమా,కునసోత్ లక్ష్మణ్ ,రాము, దేవు, చంద్రశేఖర్, బిక్యా , శ్రీనివాస్, వాంకుడోత్ దేవా బానోతు రవి, కునుసోత్ సావిత్రి, బిచ్చ, మధుకర్ సజ్జన, వినయ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టల్ లో మెనూ తప్పక అమలు చేయాలి

- హాస్టల్ లో పెండింగ్ పనులను నెలలోపు పూర్తి చేయాలి.
- రాబోవు పదవ తరగతి వార్షిక పరీక్షలో జిల్లాలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి..
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట,విశాలభారతి:**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టల్స్ నందు నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ తప్పక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం ఐడిఓసి సమావేశ మందిరం నందు అదనపు కలెక్టర్ పి. రాంబాబు తో కలిసి జిల్లాలోని సంక్షేమ హాస్టల్ వార్డెన్స్, ప్రిన్సిపల్స్, హెడ్ మాస్టర్లు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుల తో కలసి కామన్ మెనూ, పదవ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న షెడ్యూల్ మరియు హాస్టల్ మైనర్ రిపేర్ల గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో చదువుకున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, ఉదయం అల్పాహారం మధ్యాహ్నం లంచ్ రాత్రిపూట డిన్నర్ నందు ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం మెనూ అందించాలని, ఏ రోజుకు కావలసిన కూరగాయలు, పాలను ఆరోజు మార్కెట్లో కొనుగోలు చేయాలని, వాటిని పరిశుభ్రమైన ప్రదేశంలో నిలువ చేసుకోవాలని అన్నారు. బియ్యం, పప్పు, దినుసులు సంబంధిత అధికారులు దగ్గరుండి శుభ్రం చేయించాలని, బియ్యాన్ని వెలుతురు ప్రసరించే ప్రదేశంలో గోడకు కొంచెం దూరంలో నిలువ చేసుకోవాలని, ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్లు నుండి పరిశుభ్రమైన బియ్యాన్ని క్వాలిటీ, క్వాంటిటీ సరిచూసుకొని అధికారులు సంబంధిత పత్రంపై సంతకం చేసి బియ్యాన్ని తీసుకోవాలని , స్టాక్ పాయింట్ల వద్ద ఏమైనా సమస్యలు ఉంటే సివిల్ సప్లై జిల్లా మేనేజర్ ని సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే వంట చేయు వంట మనుషులు సమయానికి శుభ్రంగా వండిపెట్టాలని, టిఫిన్స్ సరిగా ఉడికే విధంగా చూసుకోవాలని మధ్యాహ్నం భోజనంలో తప్పని సరిగా సాంబార్ ఉండే విధంగా చూసుకోవాలని పిల్లలు పరిశుభ్రంగా ఉండి కాళ్లు చేతులు పరిశుభ్రంగా కడుక్కొని డైనింగ్ హాలు లోకి రావాలని కలెక్టర్ సూచించారు. రాబోవు 10వ తరగతి వార్షిక ఫలితాలలో జిల్లాను నూటికి నూరుకు శాతం 75 శాతం మార్కులతో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక క్లాసులు నిర్వహించి నూరు శాతం ఫలితాలను విధంగా జిల్లాను అగ్రస్థానంలో నిలవాలని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి బిఎస్ లత, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శంకర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనసూర్య, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్ రెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ ప్రసాద్, డి. ఇ రమేష్ జిల్లాలోని సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్స్, ప్రిన్సిపాల్ లు, స్పెషల్ ఆఫీసర్లు, హెడ్మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# బాలానగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు

**కూకట్ పల్లి, విశాలభారతి:**

శిక్షణలో భాగంగా 2024 బ్యాచ్ ట్రైనీ ఐపీఎస్ లు శనివారం బాలానగర్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బాలానగర్ పోలీస్ స్టేషన్ లో జరుగుతున్న పనులను, వివిధ కేసుల పనితీరును పరిశీలించారు. 2024 ట్రైనీ ఐపీఎస్ బ్యాచ్ కి చెందిన శశాంత్ ఎన్.ఏం (కర్ణాటక), అభిషేక్ షిరా (రాజస్థాన్), హస్సన్ రియాజ్ (మల్దీవ్స్) లు పోలీస్ స్టేషను సందర్శించిన వారిలో ఉన్నారు. వీరికి బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికి సహకరించారు. స్టేషన్ పరదిలో పలు అంశాలపై సీఐ నర్సింహా రాజును వారు అడిగి తెలుసుకున్నారు. కానిస్టేబుల్ నుంచి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ వరకు నిర్వర్తించే విధులను ఆయన ట్రైనీ ఐపీఎస్‌లకు వివరించారు. అంతేకాక ఎఫ్ఐఆర్ నమోదు, నిందితుల రిమాండ్, చార్జిషీట్ దాఖలు, కేసుల దర్యాప్తుతోపాటు విధుల్లో పాటించాల్సిన నియమ నిబంధనలపై బాలానగర్ సిఐ నర్సింహా రాజు వారికి సవివరంగా వివరించారు. ఇందులో సిఐ నర్సింహా రాజు తోపాటు ఎస్ఐలు రాంనారాయణ్, హాజీ మియా, సరళ, ఏఎస్ఐలు ఆంజనేయులు, ప్రభాకర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# గొల్లగట్టు పోస్టర్ ఆవిష్కరించిన వేణారెడ్డి

**నూతనకల్, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్రం లోనే రెండవ అతిపెద్ద జాతర అయినటువంటి గొల్ల గట్టు (పెద్ద గట్టు) లింగమంతుల జాతర యాదవ సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి,గొల్ల గట్టు చైర్మన్ ,పోలేబొయిన నర్సయ్య యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ ఆద్వర్యంలో వేర్వేరుగా ఆవిష్కరించడం జరిగింది... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని అతిపెద్ద రెండవ జాతర అయినటువంటి గొల్ల గట్టు జాతరను భక్తులంతా అధిక సంఖ్యలో పాల్గొని కావాలి కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కక్కిరేని శ్రీను,కరుణాకర్ రెడ్డి, దశరదనూతనకల్ మండల యాదవ సంఘము నాయకులు పసుల అశోక్ యాదవ్, బొల్క సైదులు యాదవ్, కొరివి గంగయ్య యాదవ్,ఉప్పుల సందీప్ యాదవ్ తదితర యాదవ సోదరులు పాల్గొన్నారు.



# మిర్చికి కనీస మద్దతు ధర రూ. 25000ఇవ్వాలి

- సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలవాల వీరయ్య

**డోర్నకల్, విశాలభారతి:**

ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకొని మిర్చి పంట వేసిన రైతులకు మార్కెట్ కి వెళితే నిరాశే మిగులుతూదని మిర్చికి కనీస మద్దతు ధర రూ :25000 లు ఇవ్వాలని సిపిఐ (ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ అల్వాల వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సమావేశం కందల రమేష్ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యగా అత్యధిక హాజరైన అల్వాల వీరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ధర దారుణంగా పడిపోతుందని జెండాకి పాటకి 25000 ఉండే ఉండాల్సిన పరిస్థితి నుంచి 12 వేలకు తగ్గించే వ్యాపారులు గిట్టుబాటు ధరలు లేకుండా చేస్తున్నారని వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గుణగంటి మోహన్ ,మండల కమిటీ సభ్యులు బాణాల రాజన్న ,కందాల రమేష్,బోడపట్ల రాజశేఖర్, కొండ ఉప్పలయ్య ,దంతు మమత తదితరులు పాల్గొన్నారు.

# మహారాజ్ కలలు కన్న గోరుర్ గోర్ వట్ ఒక బహుజన రాజ్యాం

- అభి నాయక్ తేజావత్

**డోర్నకల్, విశాలభారతి:**



మరిపెడ మండల బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు జినక కృష్ణ మూర్తి ఆధ్వర్యం లో బహుజన నాయకుడు మహావీర్, సామాజిక తత్వవేత్త, ఆదివాసి గిరిజన లంబాడీల ఐదవ గురువు సద్గురువు సేవాలాల్ మహారాజ్ గారి 286వ జయంతి ఉత్సవాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా బహుజన సమాజ్ పార్టీ మహబూబాబాద్ జిల్లా ఇంచార్జి తేజావత్ అభి నాయక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గోల్కొండ కోట మీద జెండా వేగుర వేయాలి,అలాగే ఎర్ర కోట మీద జెండా వేగుర వేయాలి ఇలా గోరూర్ గోర్ వట్ ను స్థాపించాలి అని తన ఏడవ తరానికి పిలుపు ఇచిన సద్గురువు సేవాలాల్ మహారాజ్ దీని కోసం ఒక విధాన పరము అయిన ఉద్యమం చేయాలి అని జాన్ లో! చాన్ లో!! మాన్ లో!!! అని పిలుపు ఇవ్వడం జరిగింది.జాన్ లో అనగా తెలుసుకోవడం ఇది కేవలం విద్య ద్వారా మాత్రమే సాధ్యం అనగా ఎడ్యుకేట్ అవ్వమని చెప్పిన అంబేద్కర్ మాటల ప్రతి రూపం అలాగే చాన్ లో అనగా ఏది మంచి ఏది చెడు ఏది సమాజానికి అవసరం ఔతుంది అని ఆలోచన చేసి మన లో మనము సంఘర్షణకు గురి అయ్యి జాతి హితం కోసం పని చేయడం అని అర్థం ఇది అంబేద్కర్ ఆజిటేట్ కు కు పోలీనది అలాగే మాన్ లో అనగా స్వీకరించడం ఇది అంబేద్కర్ చెప్పిన ఆర్గనైజ్ కు దగ్గర గా వ్యవస్థీకరించబడడం అని అర్థం చేసుకోవాలి అని అంబేద్కర్ గారు అలాగే సద్గురువు సేవాలాల్ మహారాజ్ ఇద్దరు కలలు కన్నది బహుజన రాజ్యం కొరకు మాత్రమే అని మనం అర్థం చేసుకోవాలి మహబూబాబాద్ జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇంచార్జి తేజావత్ అభి నాయక్ గారు తెలపడం జరిగింది.సద్గురువు సేవాలాల్ మహారాజ్ మిగతా మధ్య యుగ సాధువులు సంతువుల లాగ కుల వ్యవస్థను నిరసించడం జరిగింది అని తెలియ చేసారు, కబీర్ దాస్, చొక్కా మేళా, వీర బ్రహ్మేంద్ర స్వామి, లింగ బసవేశ్వర స్వామి లాగ సామాజిక చైతన్యం చేయడం జరిగింది అని తెలియ చేసారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ ఎడ్ల శ్రీను విశిష్ట అతిథి గా పాల్గొని సేవాలాల్ మహారాజ్ కలలు కన్న బహుజన రాజ్య స్థాపనలో ఆదివాసి గిరిజన లంబాడీల ప్రముఖ పాత్ర పోషించాలి అని పిలుపు ఇచ్చారు.అలాగే గౌరవ అతిథి గా డోర్నకల్ నియోజక వర్గ మహిళా కన్వీనర్ జినక సువార్త పాల్గొని. బహుజన రాజ్యం లో మహిళలు స్వేచ గా ఉండే అవకాశం ఉంది అని బహెన్ కుమారి మాయావతి లాగ సమాజ హితం కోసం మహిళలు ముందుకు వచి తమ వంతు కృషి చేయాలి అని పిలుపు ఇవ్వడం జరిగింది.ఈ కార్య క్రమ లో మండల సెక్రెటరీ గూగులోత్ మోహన్ పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంత క్రీడలను ప్రోత్సహించాలి

**తొర్రూరు, విశాలభారతి:**

గ్రామీణ ప్రాంత క్రీడలను ప్రోత్సహించాలని సిడబ్ల్యుసి చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను శనివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ప్రారంభించారు.ఈ పోటీలో వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు ఆటలలోనే కాకుండా అన్ని విభాగాల్లో మంచి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని అన్నారు. క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ క్రీడలు నిర్వహించడం ఆనందకరమైన విషయమని,క్రీడాకారుల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయని,ఈ క్రీడలను ప్రతి సంవత్సరం నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జెల్ల లక్ష్మీనారాయణ, పీడీలు ప్రవీణ్ రెడ్డి నర్మదా మల్లయ్య సునీత జలకం శివకుమార్, నవయుగ విజన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు బానోతు వీరన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న పినపాక తాసిల్దార్



**పినపాక, విశాలభారతి:**

మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన విద్యుత్ ప్రమాదంలో పూరి గుడిసె పూర్తిగా దగ్ధమైన విషయం తెలిసిందే. తాసిల్దార్ దగ్గర ఉండి అర్ధరాత్రి వేళలో సైతం ఫైర్ సిబ్బందితో కలిసి మంటలు అదుపు చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. నిరుపేద కుటుంబం అగ్నిప్రమాదంలో రోడ్డున పడటంతో ఆయన మానవతా దృకృథంతో 5000 రూపాయల నగదు తో పాటు ఆ కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేసి మానవత్వం చాటుకున్నారు. కష్ట కాలంలో ఆ కుటుంబానికి సాయం చేసిన తాసిల్దార్ నరేష్ ను పలువురు ప్రశంసించారు. ఎమ్మార్వో మాట్లాడుతూ కష్ట కాలంలో ఆ కుటుంబానికి ప్రతి ఒక్కరూ అందంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారిగా చల్లా లక్ష్మి కాంత్ నియామకం

**సూర్యాపేట,విశాలభారతి:**



సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారిగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సమాజ సేవకులు చల్లా లక్ష్మి కాంత్ నియామకం అయ్యారు. ఈ మేరకు సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావ్ శనివారం నియామక పత్రం అందజేశారు. చల్లా లక్ష్మి కాంత్ సూర్యాపేట లోఎన్నో స్వచ్ఛంద సంస్థల్లో తనదైన శైలిలో సేవలు అందిస్తూ ఎన్నో అవార్డులు పొందారు.చల్లా లక్ష్మి కాంత్ కు జిల్లా ఆర్య వైశ్య మహా సభ కోశాది కారి గా నియామకం ఐనా సందర్భముగా పలువురు మిత్రులు, శ్రేయోభి లాషులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భముగా లక్ష్మి కాంత్ మాట్లాడుతూ నా వంతు గా ఆర్యవైశ్య మహా సభ అభివృద్ధి కొరకు కృషి చేస్తానన్నారు.




# బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్

- **ముఖ్య అతిధిగా పాల్గొన్న సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్**

**సూర్యాపేట, విశాలభారతి:**

బంజారాల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జివివి ఫంక్షన్ హాల్ నందు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజి ఎంపిపి ధరావత్ వీరన్న నాయక్ కన్వీనర్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడమే కాకుండా బంజారా ఉద్యోగులకు సెలవుదినంగా ప్రకటించారని తెలిపారు. బంజారాలకు సంత్ సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ మహారాజ్ కు, మేరా మాయడికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బంజారాల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం కృషి చేశారని అన్నారు. హైదరాబాదు లో నిజాం నవాబు పాలనలో గోవులను, చెట్లను పెంచారని, పర్యావరణ పరిరక్షణ కు, పరిశుభ్రతకు సేవాలాల్ ప్రాధాన్యత ఇచ్చేవారని అన్నారు. ఒకేవుండాలని సేవాలాల్ బోధించారని, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బంజారా జాతిని ఏకంచేసి పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ వొ లు సూర్యాపేట శ్యామ్ సుందర్ రెడ్డి, పెన్ పహాడ్ లాలు, ఆత్మకూరు హరిశ్చంద్ర ప్రసాద్, చివ్వెంల కృష్ణయ్య, చిలుకూరు ఎంపిడివొ హరిసింగ్ నాయక్, కో కో కన్వీనర్ జాటోతు రాజేష్ నాయక్, ధారాసింగ్ నాయక్, మంగ్తా నాయక్, అజయ్ నాయక్, ఛత్రు నాయక్, వెంకటేష్, నాగు నాయక్, సైదా నాయక్, విమలా భాయి, స్వప్న, లింగా నాయక్, గోపి, పాండు, బాలు నాయక్, వాంకుడోతు వెంకన్న తదితరులు పాల్గొన్నారు .



# పదవులతో సంబంధం లేకుండా ప్రజాసేవలో కొనసాగుతా

- **మాజీ కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్**

**ఆమనగల్లు,విశాలభారతి:**

పదవులతో సంబంధం లేకుండా ప్రజాసేవలో కొనసాగుతానని కాలనీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని మాజీ కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ పేర్కొన్నారు.అమనగల్లు మున్సిపాలిటీ 15 వార్డు కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ కు . శివాలయం నగర్ కాలనీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం పురాతన శివాలయం ఆవరణలో సన్మానం కార్యక్రమం నిర్వహించారు.. లక్ష్మణ్ తో పాటు ఆయన సతీమణి శోభ ను పూలమాలలు శాలువాలతో సత్కరించి కౌన్సిలర్ గా ఆయన శివాలయం కాలనీకి చేసిన సేవలను కొనియాడారు. అభినందన సభలో మహిళలు పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొని లక్ష్మణ్ అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా తన కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు శాయశక్తుల కృషి చేశానని అన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కోట్ల వెంకటేష్, గాజుల రమేష్ ,అవ్వారి శివలింగం, కండె భాస్కర్, కండె సుమన్, జజ్జాయిల నవీన్, కండె సాయి, పురం రాఘవేందర్, చెరుకు శివ, మురళీధర్, బండ మల్లేష్, దొంతు సత్యనారాయణ, కృష్ణయ్య, గాజుల తిరుపతయ్య, గాజుల రాము, పెంటయ్య, అరుణ్ , వెంకటేష్, శ్రీనివాస్, సురేష్, గాజుల రాకేష్, శ్రీరాములు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# టాటా ఏసీ మ్యాజిక్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

**దేవరుప్పల, విశాలభారతి:**

మండల టాటా మ్యాజిక్ యూనియన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.ఈ ఎన్నికల్లో చింత నరేందర్ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మామిడి సైదులు,కార్యదర్శిగా పంగ వెంకన్న బాధ్యతలు స్వీకరించారు .ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు రెడ్డి రాజుల ఎల్లప్ప,కమిటీ సభ్యులు పసుపులేటి సోమన్న,బస్వా భాస్కర్,జోగు నవీన్,మాజీ ఉపాధ్యక్షుడు శిరవేరి సంపత్,బానోతు జితేందర్, ఈదునూరి అనిల్,దుద్దుల భాస్కర్,మంద సంతోష్,తదితరులు హాజరై నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. కమిటీ ఎన్నికల సందర్భంగా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులు యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
16.02.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## సుధాకర్ పీవీసీ సేవలు అభినందనీయం

- **డీఎస్పీ రవి**

**సూర్యాపేట,విశాలభారతి**



సుధాకర్ పీవీసీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పెద్దగట్టు జాతర సందర్భంగా ఏర్పాటు చేసే సేవలు అభినందనీయమని డీఎస్పీ రవి అన్నారు. శనివారం దురాజ్‌పల్లి చౌరస్తాలో జాతర విధులకు వస్తున్న పోలీసులకు ఏర్పాటు చేసిన భోజన వసతిని ప్రారంభించి మాట్లాడారు. ఐదు రోజుల పాటు పోలీసు సిబ్బందికి టిఫిన్, భోజనం, డిన్నర్ వసతిని ప్రతి ఏటా కల్పిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహదేవ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



# తెలంగాణ అనే రాష్ట్రాన్ని పుట్టించింది కేసీఆర్

- **సీఎం రేవంత్ రెడ్డిని ప్రజలెవరు గుర్తించడం లేదు**
- **స్వంత పార్టీ నాయకులే పేరు మర్చిపోతున్నారు**
- **మాజీ మంత్రి,బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

**బాల్కొండ,విశాలభారతి:**




తెలంగాణ అనే రాష్ట్రాన్ని పుట్టించింది కేసీఆరే అని మాజీ మంత్రి,బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ను బహిష్కరించాలన్న సీఎం రేవంత్ రెడ్డి వాఖ్యలపై ఆయన స్పందించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ...15 ఏండ్లు సుదీర్ఘ పోరాటం చేసి,ఎన్నో పదవులు గడ్డి పోచల వదిలేసి,చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సాధించారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించకపోతే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవాడా అని వేముల ప్రశ్నించారు.రాష్ట్రం రాకపోతే రేవంత్ రెడ్డి ఆంధ్ర పాలకుల మోచేతి నీళ్లు తాగుతూ బ్రతికేవాడని అన్నారు. ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డిని ప్రజలెవరు గుర్తించడం లేదన్నారు.స్వంత పార్టీ నాయకులే ముఖ్యమంత్రి పేరు మర్చిపోతున్నారని తెలిపారు.జై తెలంగాణ అన్న వాళ్ళ మీదికి తుపాకీ ఎక్కుపెట్టిన చరిత్ర రేవంత్ రెడ్డిదని అన్నారు.ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ లాగానే ఆయన వ్యవహార శైలి ఉందన్నారు.ముఖ్యమంత్రి స్థాయిలో హుందాగా వ్యవహరించడం లేదన్నారు. 100 రోజుల్లో 420 హామీలు ఇచ్చి అమలు చేస్తా అని చెప్పి ప్రజలను నమ్మించి గద్దె నెక్కాడు కానీ ఇప్పుడు అధికారం లోకి వచ్చి 14 నెలలు దాటినా ఒక్క హామీ సక్రమంగా అమలు చేయలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ చేసిన కులగణన అంత బోగస్ అని, నీపై నమ్మకం లేక ప్రజలు ఎవరు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వే లో పాల్గొనలేదని, పాల్గొన్నవారు సరైన వివరాలు ఇవ్వ లేదని అన్నారు.అన్ని బీసీ సంఘాలతో పాటు సొంత పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చేసిన కులగణను తప్పుపడుతున్నారని తెలిపారు. బీసీల జనాభా ఎందుకు తగ్గాయని ప్రశ్నిస్తున్నారని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర,ఢిల్లీ ఎన్నికల్లో ప్రచారం చేస్తే అక్కడ కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయిందిని అన్నారు. కేసీఆర్ చేసిన సమగ్ర సర్వే చేసినప్పుడు నీవు ఆ సర్వే ని వ్యతిరేకిస్తూ మాట్లాడిన మాటలు మర్చిపోయావ రేవంత్ రెడ్డి అని అన్నారు. ప్రజలకు క్షమాపణ చెప్పి అడ్డమైన ప్రశ్నలు తీసివేసి మళ్లీ కులగణన సర్వే చేస్తే అప్పుడు ప్రజలు సర్వేలో పాల్గొంటారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైన నోరు అదుపులో పెట్టుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని అన్నారు. లేకుంటే కేసీఆర్ ని బహిష్కరించడం నీ కలలో మాట కానీ...తెలంగాణ ప్రజలు, అలాగే కాంగ్రెస్ పార్టీ మాత్రం నిన్ను శాశ్వతంగా బహిష్కరించే రోజు దగ్గరలోనే ఉంటుందని అన్నారు.ఇకముందు కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావులపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడాం ఆపేయమని హెచ్చరించారు.



# కే.వి.కే గడ్డిపల్లిని సందర్శించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట,విశాలభారతి:**

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని (కే.వి.కే) సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం సందర్శించారు. ఈ సందర్బంగా కలెక్టర్ కె.వి.కె.లో జరుగుతున్న వివిధ శిక్షణ కార్యక్రమాలు, విస్తరణ కార్యక్రమాలు మరియు రైతులకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. కె.వి.కె. శాస్త్రవేత్తలు కలెక్టర్ కే.వి.కే లో ఉన్న భూసార పరీక్షల కేంద్రం, జీవనఎరువుల ఉత్పత్తి కేంద్రం, అజోల్ల యూనిట్, నేరుగా విత్తే పద్ధతిలో వరి సాగు, షేడ్ నెట్ లో కూరగాయల నారు పెంపకం, వర్మి కంపోస్ట్ యూనిట్, చేప పిల్లల పెంపకం, సెరికల్చర్ యూనిట్, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ సందర్శించి రైతులకు ఏ విధంగా ఉపయోగపడుతుందని తెలుసుకున్నారు. సేంద్రీయ వ్యవసాయం, పంటల మార్పిడి, మరియు నూతన వ్యవసాయ సాంకేతికతలపై రైతులకు వివరించాలని తెలియజేశారు. కలెక్టర్ ఈ కార్యక్రమాలను ప్రశంసించి, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు మరియు వ్యవసాయ రంగంలో సుస్థిరత సాధించేందుకు ఈ విధమైన కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్శనలో హార్టికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులతో మాట్లాడి కోర్స్ యొక్క ఉపయోగాలను విద్యార్థులకు తెలియజేశారు. అలాగే కె.వి.కె. ద్వారా రైతులు పొందుతున్న ప్రయోజనాలను కే.వి.కే శాస్త్రవేత్తలు వివరించారు. మరియు మరింత సహకారం రైతులకుఅందించాలని ఆదేశించారు. కలెక్టర్ కే.వి.కే గడ్డిపల్లికి జరిగే కార్యక్రమాలకు భవిష్యత్తులో మరింత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జి. శ్రీధర్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ బి. శ్యాం సుందర్ ప్రసాద్, హుజూర్నగర్ ఎడిఎ రవికుమార్ గరిడేపల్లి మండల వ్యవసాయ అధికారి ప్రీతం కుమార్ కె.వి.కె గడ్డిపల్లి శాస్త్రవేత్తలు డి నరేష్, ఎ.కిరణ్ టి. మాధురి డి.ఆదర్శ్, యన్ సుగంధి మరియు కె.వి.కె సిబ్బంది ఏ.నరేష్, బి.ఉపేందర్, ఎం.సైదులు బి. రామ్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వృక్షార్చన పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వేముల

**బాల్కొండ,విశాలభారతి**



మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ నిర్వహించే గ్రీన్ ఇండియా ఛాలెంజ్,వృక్షార్చన పోస్టర్ ను హరితసేన నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ భోజనారాయణ ఆదేశాల మేరకు, హరితసేన బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ గడల ప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరూ 3 మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి,వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవటమే కేసీఆర్‌కు మనం ఇచ్చే పుట్టినరోజు కానుక అని ఎమ్మెల్యే వేముల అన్నారు. ఈ కార్యక్రమంలో నాగేదర్,మాజీ ఎంపీటీసీ రాజు,శ్రీనివాస్,రమేష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ

**ఆర్మూర్, విశాలభారతి:**

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గల ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తుల ర్యాలీ శనివారం నిర్వహించారు మెదక్ జిల్లా చేగుంట మండలం సమగ్ర శిక్ష ఉద్యోగులైనటువంటి సీఆర్పీలు రమేష్ నాయక్ మరియు శ్రీనివాసుల ను ఆటో ఢీకొనడంతో శుక్రవారం మరణించడం జరిగింది. కావున వారి ఆత్మకు శాంతి కలగాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో కొవ్వొత్తిన ర్యాలీ నిర్వహించి వారికి శ్రద్ధాంజలి ఘటించారు .ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ శ్రీనివాస్ మరియు రమేష్ నాయక్ ల కుటుంబం నిరుపేద కుటుంబాలని వారికి ప్రభుత్వం వెంటనే 20 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించి మానవీయ కోణంలో ఆలోచించి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు రమేష్ ,ప్రభు, చిరంజీవి ,అప్సర్ ,అప్నేజర్, లక్ష్మణ్ ,గంగాధర్ ,భోజన్న, షఫీ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకే టాలెంట్ టెస్ట్

- **పాపిశెట్టి రాము**

**ఆమనగల్లు,విశాలభారతి :**

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు టిఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ కర్రే సుదర్శన్ అన్నారు. మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్లొ ప్రభుత్వ, ప్రవేట్ విద్యార్థులకు ఎస్ఎస్సి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాపిశెట్టి రాము హాజరై ప్రశ్నాపత్రాలు విడుదల చేసి విద్యార్థులకుఅందజేశారు.అనంతరం రాము మాట్లాడుతూ విద్యార్థులు వారి మేధోశక్తిని పెంపొందించడానికి టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించి ప్రతిబను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామని తెలిపారు.టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీయడానికి దోహదపడుతుందని భవిష్యత్తులో ఇది వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.నాయకులు శంకర్, పిప్పళ్ళ శివశంకర్,ఎవి శర్మ,శివలింగం, శ్రీరామ్, నరేష్, శ్రీశైలం మీసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

ఆదివారం,
16.02.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





మాజీ మంత్రివర్యులు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొన్నాల లక్ష్మయ్య జన్మదినం సందర్భంగా వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ మరియు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ బదిలీ



**ఆమనగల్లు,విశాలభారతి :** ఉద్యోగులు విధినిర్వహణలో అందించిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని, పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ రాధిక అందించిన సేవలు, చేసిన అభివృద్ధి మరువలేనిదని మాజీ ప్రజాప్రతినిధులు కొనియాడారు.శనివారం కడ్తాల్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఆమెను సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథ్ నాయక్, ఆనంద్, లక్ష్మీ నరసింహ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, పాడి రైతులు పాల్గొన్నారు

# రోగులు ఫుల్.. మందులు నీల్

- సైదాపూర్ ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత
- వేధిస్తున్న సమస్యలు
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలి




**సైదాపూర్ ,విశాలభారతి:** సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి అధ్వన్నంగా తయారైంది. సూది ఉంటే మందు ఉండదు, మందు ఉంటే సూది ఉండదు. సూది, మందు ఉంటే వైద్యుడు ఉండదు అన్నచందంగా మారిపోయింది. గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాల్సిన దవాఖానాలు మసకబారుతున్నాయి. మందుల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ మందులు కూడా లేవంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### బయట కొనుగోలు చేసుడే..


ఆసుపత్రిలో మందుల కొరత ఏర్పడటంతో చిన్నపాటి అనారోగ్య సమస్యలకు కూడా మందులు అందని పరిస్థితి నెలకొంది. మందులు బయట కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయలు ప్రభుత్వ ధనం ఖర్చు పెట్టి ఆసుపత్రి ఏర్పాటు చేశారు. కానీ ఆసుపత్రిలో తగిన వైద్య సిబ్బంది లేరని, రోగులకు కనీస వైద్యం మందులు అవసరాలు తీర్చలేని పరిస్థితిలో ఆసుపత్రి ఉందంటూ పలువురు విమర్శిస్తున్నారు.

### పెరిగిన ఓపీల సంఖ్య..

సైదాపూర్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలు దాదాపు 30 పల్లెల నుంచి రోగులు సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యం పొందుతారు. రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆసుపత్రికి ఓపీల సంఖ్య పెరుగుతోంది కానీ రోగులకు అవసరమైన మందులు మాత్రం అందుబాటులో లేవు.

### డిఎంహెచ్ఓ సందర్శించినా మారుని తీరు

ఇటీవల డిఎంహెచ్వో సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. పని తీరు మార్చుకోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లేకుంటే చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అయితే డిఎంహెచ్వో వచ్చి వెళ్లిన తర్వాత కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనపడటం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందన తయారయింది. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆసుపత్రిలో సరైన మందులు అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని రోగులు కోరుతున్నారు.




యలమంచిలి ట్రస్ట్ క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న మహేష్ కుమార్ గౌడ్

## యలమంచిలి చారిటబుల్ ట్రస్ట్ సేవలు భేష్

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** యలమంచిలి చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ కార్యదర్శి యలమంచిలి ఉదయ్ కిరణ్ శనివారం మహేష్ కుమార్ గౌడ్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ట్రస్టు క్యాలెండర్ ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజోపకరమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న యలమంచిలి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ టీం సభ్యులను ఆయన అభినందించారు.సామాజిక సేవ స్పృహను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా తీసుకెళ్లి అర్హులను సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని తెలిపారు.అనంతరం యలమంచిలి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశానుసారం వివిధ సేవా కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ కోసం కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో శరత్,వినోద్,కృష్ణ,వంశీ,ప్రవీణ్ పాల్గొన్నారు.



## బంజారాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి


- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి.

**ఆమనగల్లు,విశాలభారతి:** బంజారాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు కలసి కృషి చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి,జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆమనగల్లు, కడ్తాల్ పట్టణ కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనుల ఆరాధ్యుడు సంతు సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి రోడ్డు హైదరాబాదు శ్రీశైలం జాతీయ రహదారి పక్కన సేవాలాల్ ఘాట్ వద్ద గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని , సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసే ఘనంగా నివాళులు అర్పించారు. అంతకుముందు గిరినులు జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళలు తమ సాంప్రదాయ వేషధారణతో అలరించారు. సేవాలాల్ జయంతి వేడుకలకు హాజరైన నాయకులు మాట్లాడుతూ... బంజారాల అభివృద్ధికి సేవాలాల్ చేసిన కృషి కొనియాడారు. హిందూ ధర్మము గొప్పతనాన్ని బంజారాలకు తెలియజేసి సంస్కరణలకు స్వీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్,ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము,గిరిజన నాయకులు పత్యానాయక్, దశరత్ నాయక్, రవీందర్, కృష్ణ, రాంపాల్,శంకర్,రాములు,సురేష్, రమేష్, వినోద్, చందు, అమర్ సింగ్, ప్రశాంత్, పవన్, శంకర్, మణిపాల్, గణేష్, విజయ్, నరేష్, రవిరాథోడ్ , రఘు తదితరులు పాల్గొన్నారు



## మహా కుంభాభిషేకం,సేవాళాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల

**బాల్కొండ,విశాలభారతి:** మాజీ మంత్రి,బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలోని భీమ్గల్,మానాల గ్రామాల్లో పర్యటించారు. భీమ్గల్ మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగిన మహా కుంభాభిషేకం,పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. స్వామి వారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారి కృప అందరిపైనా ఉండాలని వేడుకున్నారు. మానాల లో గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాళాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకల్లో పాల్గొని సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాత దర్శనం చేసుకొని, గిరిజన సోదరి సోదరమనులందరు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాక్షించారు.





## మల్లారంలో మహిళా రక్షణ చట్టాలపై మహిళలకు అవగాహన

- 24 గంటలు సేవలందిస్తున్న సిబ్బంది
- 181 మహిళా హెల్ప్ లైన్ నంబర్ ద్వారా తక్ష సహాయం

**విశాలభారతి,భీమదేవరపల్లి :** మండలంలోని మల్లారం గ్రామంలో వివో కమ్యూనిటీ హాల్ లో మహిళ, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సఖీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ యొక్క ముఖ్య ఉద్దేశాలు, అందిస్తున్న సేవలను లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ అనూష, వివోఏ శోభారాణి పాల్గొని వివరించారు. అంతేగాక సఖి అందిస్తున్న 5 రకాల సేవలు కౌన్సిలింగ్, వైద్య, పోలీస్, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం గూర్చి తెలిపారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాల వాటి నుండి రక్షణ పొందడానికి సఖి సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. సఖి సెంటర్ సిబ్బంది 24 గంటలు సేవలు అందిస్తుందని, సమస్య ఉన్నప్పుడు 181 మహిళ హెల్ప్ లైన్ నెంబర్ కు కాల్ చేయడం ద్వారా తక్షణ సహాయం రక్షణ లభిస్తుందని అన్నారు. అదేవిధంగా 08702452112, 7382983088 అనే నెంబర్ లకు కాల్ చేయడం ద్వారా బాధిత మహిళలకు తక్షణ సహాయం అందించ బడుతుందని తెలిపారు.



ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన గబ్బేట స్వామి(ఇంద్రానగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి) కీర్తనల వివాహము హుజురాబాద్ పట్టణంలోని సాయిరూప ఫంక్షన్ హాల్లో జరగగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ వారితో సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ ఇంద్రనగర్ గ్రామ శాఖ అధ్యక్షులు అంబాల రాజకుమార్ దామెర గ్రామ శాఖ అధ్యక్షులు సాతూరి చంద్రమౌళి బిఆర్ఎస్ నాయకులు పాటి భగవాన్ గౌడ్ ఇంద్రనగర్ బిఆర్ఎస్ నాయకులు ప్రజలు తదితరులు హాజరయ్యారు

విశాలభారతి, ఎల్కతుర్తి



## ఘనంగా షబ్బీర్ అలీ జన్మదినం

**ఆర్మూర్, విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ కమిషన్ సలహాదారు షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలను శనివారం నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, నుడా చైర్మన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాయేర్ బిన్ హందన్, రత్నాకర్, రాంభూపాల్, మీసాల సుధాకర్ , జాబిలక్రం, విక్కీ యాదవ్, కుద్దూస్, అరుణ్, నవీన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



భీమదేవరపల్లి మండలం ములకనూరులో బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు గద్వాల ప్రశాంత్ వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరైన హుస్నాబాద్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, మాజీ జెడ్పిటిసి వంగ రవీందర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మండల సురేందర్, పున్నీ, దార్న శ్రీనివాస్, సుధాకర్, మాజీ ఎంపీటీసీ బొల్లంపల్లి రమేష్, జక్కుల రాజు, అప్పని బిక్షపతి, కూన యాదగిరి పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
16.02.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి

ఎల్బీ నగర్,విశాలభారతి



సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా నందనవనం కాలనీ హనుమాన్ దేవాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, శివ నాయక్, సచిన్ నాయక్ ,రవి నాయక్, వెంకటేష్ శివ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో కార్పొరేటర్ శ్రీకాంత్, హుస్సేన్ నాయక్

# ఘనంగా సత్ సేవాలాల్ జయంతి

- ముఖ్యఅతిథిగా హాజరైన ట్రైబల్ కమిషన్ నెంబర్ జాటోతూ హుస్సేన్ నాయక్

శేరిలింగంపల్లి,విశాలభారతి:

మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండాలో నడిగడ్డ తండా గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బంజారాల ఆరాధ్యదైవం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలలో నేషనల్ షెడ్యూల్ ట్రైబల్ కమిషన్ మెంబర్ జాతోతూ హుస్సేన్ నాయక్ నడిగడ్డ తండ గిరిజన సంక్షేమ సంఘం నాయకులతో కలసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పూజలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను బోధిస్తూ దేశమంతా సంచరిస్తూ బంజారాలకు హితబోధ చేసిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు.యావత్ భారత దేశం అంతా సంచరిస్తూ ఉప్పు అమ్ముకుంటూ,ఆవులను మేపుకుంటూ దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ మహారాజ్ ఏకం చేశారని చెప్పారు.స్థిరనివాసం ఆవశ్యకతను తెలిపి, బంజారా జాతిని మూఢనమ్మకాల నుంచి హింసా,మద్యపానం వ్యసనాలకు బానిస కాకుండా స్వచ్ఛమైన జీవనం కొనసాగించాలని బంజారాల గురువు 'సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్' హితోపదేశం చేశారని పేర్కొన్నారు.ఆయన జయంతిని బంజారాలు ఒక పండుగలా జరుపుకుంటున్నారని, గిరిజనులకు దశ,దిశను చూపి, హైందవ ధర్మం గొప్పదనం, విశిష్టతలను తెలియ జేయడానికే సేవాలాల్ మహారాజ్ జన్మించారని,బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారన్నారు.దీంతో శ్రీ సంత్ సేవాలాల్ ఇతర కులాల వారికి కూడా ఆదర్శ మూర్తిగా నిలిచారని గుర్తు చేశారు.ఆయనను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నడిగడ్డ తండా గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు అల్వర్ స్వామి నాయక్,తిరుపతి నాయక్, సీతారాం నాయక్, హనుమంతు నాయక్, దసరత్ నాయక్,గోపి నాయక్,మోహన్ నాయక్,లక్పతి నాయక్,దేవా నాయక్, రెడ్యా నాయక్, యూత్ అధ్యక్షుడు దినేష్ నాయక్, సచిన్, శివ,లక్ష్మణ్,సాయి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.





# సేవాలాల్ మహారాజ్ భోదనాలు అనుసరణీయం

- బంజారాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు,విశాలభారతి

బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ బోధనలు నేటి తరానికి అనుసరణీయమని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎంపీపీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సంత్ శ్రీ శ్రీ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలోని బంజారాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించామని తెలిపారు. సొంత నిధులతో నియోజకవర్గ పరిధిలోని రాళ్ల కత్వ తాండ, ఐలాపూర్ తాండ, వెలిమెల తాండ, కొల్లూరు తాండ లలో సేవాలాల్ మహారాజ్ దేవాలయాలను నిర్మించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిపి రాథోడ్, సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రాథోడ్, పటాన్ చెరు ఎంఈఓ నాగేశ్వరరావు నాయక్, అమీన్ పూర్ మాజీ జెడ్పీటీసి సుధాకర్ రెడ్డి, బల్దియా డిప్యూటీ కమిషనర్ సురేష్, సీనియర్ నాయకులు ఐలేష్, మంగీలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- జోనల్ కమిషనర్ నీ కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే

నాచారం,విశాలభారతి:

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం నిధులు మంజూరు చేయవలసిందిగా కోరారు. ప్రధానంగా రోడ్డు, ఓపెన్ జిమ్ , కమ్యూనిటీ హాల్ మొదలగు సంబంధించి నిధులు మంజూరు చేయవలసిందిగా కోరారు. అలాగే పలు కాలనీలలో భూగర్భ డ్రైనేజీలు నిర్మించడం వల్ల పాడైన రోడ్ల స్థానంలో కొత్త సిమెంట్ రోడ్లు నిర్మించాలని కోరడం జరిగింది. దీనికి సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# దత్తాత్రేయ ఆలయ విగ్రహానికి రూ.50వేలు విరాళం ప్రకటించిన బండి రమేష్

కూకట్ పల్లి,విశాలభారతి:

కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్ కాలనీ హరిహర క్షేత్రంలో శనివారం దత్తాత్రేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మరియు కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరిహర క్షేత్రంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆలయంలో హోమం భక్తులకు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. తరచూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకుడు, ఆలయ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నాగిరెడ్డిని రమేష్ అభినందించారు. ఈ మేరకు తన వంతుగా ఆలయ అభివృద్ధికి నిర్మాణానికి రూ. 50 వేలను రమేష్ ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సత్యం శ్రీరంగం, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పా రెడ్డి, ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాది రెడ్డి యుగంధర్ రెడ్డి, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, సాధు ప్రతాప్ రెడ్డి, తూము మనోజ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజ్ పుత్, శివ చౌదరి, జగదీష్, సంతోష్, సంధ్య ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఓయూలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

- మాజీ మంత్రి ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిశోర్ కుమార్

విశాలభారతి,ఓయూ:

భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు సందర్భంగా బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు జిల్లా నాగయ్య ఆధ్వర్యంలో సైన్స్ కాలేజ్ గ్రౌండ్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్ లు వాలీబాల్ పోటీలు శనివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, చిరుమల్ల రాకేష్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నరసింహ రెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, నేవురి ధర్మేందర్ రెడ్డి, పల్లా ప్రవీణ్ రెడ్డి, వల్లమల్ల కృష్ణ, తొట్ల స్వామి యాదవ్, మంద సురేష్, పడాల సతీష్, కడారి స్వామి యాదవ్, టైగర్ రఘురాం, జంగం అవినాష్, గదరాజు చందు, వేల్పు కొండ వెంకట్, నవీన్ గౌడ్, జంగయ్య, మిథున్ ప్రసాద్, నాగారం ప్రశాంత్, వెంకట్, ఉస్మానియా యూనివర్సిటీ బిఆర్ఎస్వి నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఈ వాలీబాల్ పోటీల్లో పాల్గొనాలని జిల్లా నాగయ్య కోరారు.



# మైత్రి సివిల్ కన్స్ట్రక్షన్ లిజనింగ్ వర్క్స్ ఆఫీసును ప్రారంభించిన అరికెపూడి గాంధీ

కూకట్ పల్లి,విశాలభారతి:

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ లో దాసరి రాహుల్ ప్రదీప్ బుల్లెట్ రవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మైత్రి కన్స్ట్రక్షన్స్ లిజనింగ్ వర్క్స్ ఆఫీస్ ను శనివారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. వారిరువురిని మైత్రి కన్స్ట్రక్షన్ యాజమాన్యం శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులుగా సమాజ శ్రేయస్సు కై పనిచేస్తూ మరొక అడుగు ముందుకు వేస్తూ కన్స్ట్రక్షన్స్ లిజనింగ్ వర్క్స్ ఆఫీసును ప్రారంభించి, సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో కన్స్ట్రక్షన్స్ లోన్లు ఇప్పించి మరింత ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ ప్రాంతాన్ని ఎంచుకొని ఇలాంటి ఆఫీసు ఓపెన్ చేయడం సంతోషకరమని, ఆఫీస్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రేయోభిలాషి తెల్ల హరికృష్ణ ఆల్విన్ కాలనీ డివిజన్ కి సంబంధించిన వివిధ రాజకీయ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, బస్తీ వాసులు, మహిళా నాయకురాలు, మిత్రులు శ్రేయోభిలాషులు జర్నలిస్టు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.






# బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్ చెరు,విశాలభారతి

బంజారాల సంఘ సంస్కర్తగా, ఆధ్యాత్మిక గురువుగా, ప్రకృతి ప్రేమికుడిగా బంజారాల సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించిన బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టేడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఆ మహనీయుడి చిత్రపటానికి చిట్కుల్ లోని ఆయన నివాసంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ అడవి బిడ్డల ప్రత్యేకమైన ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం, సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడడం కోసం సంత్ సేవాలాల్ చేసిన కృషి గొప్పదన్నారు. తన ప్రజలను బయటి సమాజం నుంచి అనుక్షణం రక్షించుకునే దిశగా సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితాంతం పోరాటం సాగించారన్నారు. ఆ దిశగా వారు కల్పించిన చైతన్యం, వారు చేపట్టిన కార్యాచరణ దేశవ్యాప్తంగా వున్న లంబాడా,బంజారాలకు రక్షణ కవచంగా నిలిచిందన్నారు. బంజారాలకు స్ఫూర్తి ప్రదాతగా నాటి కాలంలో వారు చేసిన కృషి విశ్వవ్యాప్తంగా వున్న బంజారాలకు వారిని ఆధ్యాత్మిక గురువుగా, తమ ఆరాధ్య దైవంలా కొలిచేలా చేసిందని కొనియాడారు. బంజారాల హక్కులు, నిజామ్, మైసూరు పాలకుల దాష్టీకాలకు వ్యతిరేకంగా..18వ శతాబ్దంలో సాగిన పోరాటంలో సంత్ సేవాలాల్ కీలక భూమిక పోషించారని తెలిపారు. ఆంగ్లేయులు, ముస్లిం పాలకుల ప్రభావాలకు లోను కాకుండా, ఇతర సంప్రదాయాల్లోకి బంజారాలు మారకుండా సేవాలాల్ ఎంతగానో కృషి చేశారన్నారు. తద్వారా బంజారాలకు ఆయన ఆరాధ్య దైవమయ్యాడు. అలాంటి మహనీయుడిని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని నీలం మధు పిలుపునిచ్చారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



cinema updates



# ఇంటర్నేషనల్ లెవెల్ లో పాపులర్

సౌత్ సినిమా స్థాయి ఈ మధ్య బాగా పెరిగిపోయింది. ఒకప్పుడు తెలుగు సినిమా అంటే చిన్న చూపు చూసే వారంతా ఇప్పుడు అదే తెలుగు సినిమా కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అంత గొప్ప స్థాయికి తెలుగు సినిమా ఎదిగింది. పుష్ప సినిమాలోని శ్రీవల్లి స్టెప్ నుంచి తగ్గేదేలే డైలాగ్ వరకు అన్నీ నేషనల్ లెవెల్ లో ఎంత పాపులర్ అయ్యాయో తెలిసిందే. ఇప్పుడు బాలయ్య నటించిన డాకు మహారాజ్ లోని దబిడి దిబిడి సాంగ్ కూడా అదే విధంగా పాపులరవుతోంది. సినిమా రిలీజ్ టైమ్ లో ఈ సాంగ్ వచ్చినప్పుడు అందరూ ఇదేం పాట, ఇవేం స్టెప్స్ అని విమర్శించారు. విమర్శించిన వారంతా విస్తుబోయేలా ఈ సాంగ్ దేశం దాటి మరీ పాపులారిటీని దక్కించుకుంటుంది. బాలయ్య, ఊర్వశీ కలిసి చేసిన ఈ పాటలోని డ్యాన్స్ మూమెంట్స్ ను రీ క్రియేట్ చేస్తూ వేల మంది రీల్స్ చేస్తున్నారు. ఈ పాటకు రీల్స్ చేస్తే ఎవరికైనా మంచి వ్యూస్ రావడం గ్యారెంటీ. ఈ కారణంతోనే దబిడి దిబిడి సాంగ్ ఇంటర్నేషనల్ లెవెల్ లో వైరల్ అవుతుంది. రీసెంట్ గా ఏ ఫంక్షన్ జరిగినా ఈ పాటకు డ్యాన్సులేస్తున్నారు జనాలు. ఇటీవలే కాలేజ్ అమ్మాయిలు హాస్టల్ లో వేసిన దబిడి దిబిడి స్టెప్పులు వైరల్ అవగా, ఇప్పుడు విదేశీ అమ్మాయిలు ఈ సాంగ్ కు వేసిన స్టెప్పులు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పుష్ప పాట తర్వాత ఓ సాంగ్ ఈ రేంజ్ లో వైరల్ అవుతుందంటే అది ఈ పాటే. చూస్తుంటే ముందు ముందు ఈ పాటకు మరింత రీచ్ పెరగడం ఖాయం. దబిడి దబిడి సాంగ్ కోసం తమన్, మ్యూజికల్ ఫ్యాన్స్ ఏం కోరుకుంటారో అదే ఇచ్చాడు. ఆ పాటకు శేఖర్ చేసిన కొరియోగ్రఫీని కూడా ఫ్యాన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. మొదట్లో ఈ సాంగ్ స్టెప్స్ పై నెట్టింట తీవ్ర విమర్శలొచ్చాయి. ఇప్పుడు వారంతా ఈ సాంగ్ ఇంటర్నేషనల్ లెవెల్ లో ట్రెండ్ అవడాన్ని చూసి షాకవుతున్నారు.

# టాలీవుడ్ కి కియారా ఇక కష్టమేనా?

బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వాణీ టాలీవుడ్ నుంచి పాన్ ఇండియాలో సంచలనం అవుతుందనుకుంటే? అమ్మడి కెరీర్ మాత్రం మరోలా సాగుతోంది. ఇప్పటి వరకూ తెలుగులో మూడు సినిమాలు చేసింది. అందులో ఒకటి మాత్రమే హిట్ అయింది. అదే `భరత్ అనే నేను`. మిగిలిన రెండు చిత్రాలు `వినయ విధేయ రామ`, `గేమ్ ఛేంజర్` చిత్రాలు డిజాస్టర్లగా మారిన సంగతి తెలిసిందే. ఫ్లాప్ చిత్రాలు కూడా రామ్ చరణ్ తో నటించినవే. దీంతో రామ్ చరణ్ అమ్మడికి ఓ ఫ్లాప్ సెంటిమెంట్ గానూ మారిపోయాడు. అయితే ఈ సెంటిమెంట్ ఇక్కడితో ఆగిపోదు. తదుపరి కూడా కొనసాగుతుంది. ఎందుకంటే టా లీవుడ్ లో సెంటిమెంట్ ని దర్శక, నిర్మాతలు బలంగా నమ్ముతారు. సక్సెస్ ఉన్న భామలకే అవకాశాలివ్వడానికి చూస్తారు. శంకర్ లా ఫ్లాప్ వచ్చిందని పట్టించుకోకుండా ఛాన్సులిచ్చే టాలీవుడ్ డైరెక్టర్లు చాలా అరుదు. ఈ నేపథ్యంలో కియారాకి టాలీవుడ్ లో ఇకపై అవకాశాలు కష్టమే అన్న మాట బలంగా వినిపిస్తుంది. సాధారణంగా టాలీవుడ్ లో సక్సెస్ అన్నది కీలక పాత్ర పోషిస్తుంది. ఫేం ఫాం ఉన్న భామలనే దర్శకులు హీరోయిన్లగా తీసుకుంటారు. మార్కెట్ లో స్టార్ డమ్ని బేస్ చేసుకుంటారు. ఆ ప్రకారమే పారితోషికం ఇచ్చి సకల సౌకర్యాలు కల్పిస్తారు. సక్సెస్ లేని భామల వైపు తెలుగు దర్శకులు చూసే పరిస్థితి ఉండదు. ఒకవేళ దర్శకుడు కన్విన్స్ అయినా? హీరో, నిర్మాత అందుకు ఒప్పకునే పరిస్థితి ఉండదు. ముఖ్యంగా హీరోయిన్ ఎంట్రీ విషయంలో హీరో కీలక పాత్ర పోషిస్తాడు. తన పక్కన ఏ హీరోయిన్ నటించాలన్నది హీరోనే డిసైడ్ చేస్తాడు. బాగా పాపులర్ అయిన డైరెక్టర్ అయితే హీరోయిన్ ఛాయిస్ అన్నది తన చేతుల్లో ఉంటుంది తప్ప! లేదంటే అందుకు ఛాన్స్ ఉండదు. శంకర్ అలాగే కియారాని `గేమ్ ఛేంజర్` లో కి తీసుకొచ్చాడు. మరి ఇలాంటి పరిస్థితుల్లో కియారాకి కొత్త ఛాన్సులు రావడం కష్టమే.



# కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రండి



ఒకప్పుడు టాలీవుడ్ లో అగ్ర హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్ స్టార్ హీరోలందరితో కలిసి సినిమాలు చేసింది. కానీ గత కొంత కాలంగా రకుల్ కు ఆశించిన స్థాయిలో సినిమాలు రావడం లేదు. అమ్మడు చివరిగా ఇండియన్2 సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చింది. కానీ ఆ సినిమాలో పెద్దగా గుర్తింపు లేని పాత్ర చేసిన రకుల్ ఇప్పుడు తన భర్త నిర్మాణంలో బాలీవుడ్ లో ఓ సినిమా చేస్తోంది. ప్రస్తుతం రకుల్ తన ఫోకస్ మొత్తం బాలీవుడ్ పైనే పెట్టింది. అమ్మడు ఇప్పుడు అజయ్ దేవగన్, మాధవన్ తో కలిసి దే దే ప్రాయ్ దే2 సినిమాలో నటిస్తోంది. దీంతో పాటూ తమిళంలో కమల్ హాసన్ హీరోగా తెరకెక్కనున్న ఇండియన్3 లో కూడా నటించనుంది. రకుల్ కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గానే ఉంటుంది. తన సినిమాలకు సంబంధించిన అప్డేట్స్ తో పాటూ, వ్యక్తిగత అభిప్రాయాలను కూడా రకుల్ తన సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంటుంది. అందులో భాగంగానే రకుల్ తాజాగా తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ చేసింది. అందులో అలవాటైన పనుల నుంచి, ప్రాంతాల నుంచి బయటకు రమ్మని, కంఫర్ట్ గా ఉన్న ప్లేసే మీకెప్పడూ శత్రువుగా మారుతుందని రాసి ఉన్న కోట్ ను పోస్ట్ చేసింది. ప్రజలు సోమరితనంగా మారడానికి కారణం ఎప్పడూ ఒకే ప్లేస్ లో ఉండటమని, దాని వల్ల సౌకర్యం ఎక్కువ అవుతుందని, ఎవరూ ఒక వర్క్ నుంచి మరో వర్క్ కు మారడం లేదని, రెగ్యులర్ గా అలవాటైన పనినే చేస్తున్నారని, వీటన్నింటినీ అలవాటు పడి ఏదైనా కావాలనుకున్నప్పడు కూడా రేపు చూద్దాంలే అనుకుంటున్నారని, ఈ కారణాల చేతే చాలా మంది ఎదగడం లేదని రకుల్ షేర్ చేసిన కోటేషన్ లో ఉంది. ఎవరైనా సరే జీవితంలో పైకి ఎదగాలంటే కఠినమైన విషయాల గురించి ఆలోచించాలని, వాటిని ఆచరణలో పెట్టాలని అప్పడే సక్సెస్ అందుకుంటామని, అలవాటైన ప్రాంతం అందంగా ఉన్నప్పటికీ అది జీవితంలో పైకి ఎదగనీయదని రాసి ఉన్న కొటేషన్ ను రకుల్ షేర్ చేసింది. ఇక రకుల్ తన గురించి చెప్తూ తాను చాలా స్ట్రాంగ్ అని, తనను తాను ఎక్కువగా ప్రేమించుకుంటానని, ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకుంటానని రకుల్ తెలిపింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.